

హైదరాబాద్ టెస్కాబ్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు, పాలకవర్గ సభ్యులు

తొలగిన ఉత్కంఠ 6

డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలం గడువు పొడిగింపు

- మరో 6 నెలలు పొడిగించిన ప్రభుత్వం..
- సంబురాల్లో పాలకవర్గం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India

UMFB వరంగల్ శాఖ

డోర్ నం: 11-26-57, 1వ అంతస్తు, శ్రీ సాయి ఆర్కేడ్, ఎం.జి.రోడ్డు, గోపాలస్వామి దేవాలయం దగ్గర, వరంగల్ జిల్లా, తెలంగాణ - 506002

ఇమెయిల్: ubin0534684@unionbankofindia.bank, ఫోన్: 8369434680

స్వాధీనతా ప్రకటన

[రూల్-8(1)] (స్థిరాస్తి కోసం)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB వరంగల్, డోర్ నం.11-26-57, 1వ అంతస్తు, శ్రీ సాయి ఆర్కేడ్, ఎం.జి.రోడ్డు, గోపాలస్వామి దేవాలయం దగ్గర, వరంగల్, తెలంగాణ - 506002 యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ నం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న రుణగ్రహీత(ల)కు 13.05.2025 తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు

1. మెసర్స్ కనకదుర్గ ఫెర్టిలైజర్స్ డిపో, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రైటర్: శ్రీ కాట్కూరి శంకర్ తండ్రి రాజయ్య, కార్యాలయ/ నివాస చిరునామా: ఇ.నం.8-11-116, కొండూరివారి వీధి, జేపీఎన్ రోడ్డు దగ్గర, వరంగల్, తెలంగాణ రాష్ట్రం - 506002

హామీదారు(లు): 1. శ్రీమతి స్వర్గీయ కాట్కూరి లత భర్త కాట్కూరి శంకర్ (శ్రీమతి కాట్కూరి లత మరణించినందున, దిగువ తెలిపిన న్యాయవారసులచే ఆమె ప్రాతినిధ్యం వహించబడుచున్నది: (ఎ) శ్రీ కాట్కూరి శంకర్ తండ్రి రాజయ్య, ఇ.నం.8-11-116, కొండూరివారి వీధి, జేపీఎన్ రోడ్డు దగ్గర, వరంగల్, తెలంగాణ రాష్ట్రం - 506002; (బి) శ్రీమతి చకిలం మౌనిక భర్త చకిలం వెంకటకృష్ణ, ఇ.నం.4-1/బి/1, కనకదుర్గ కాలని, కనకదుర్గ దేవాలయం దగ్గర, గోపాలపురం, భీమారం, వరంగల్, తెలంగాణ రాష్ట్రం - 506015; (సి) శ్రీ కాట్కూరి మణిదీప్ కుమార్ తండ్రి కాట్కూరి శంకర్, ఇ.నం.8-11-116, కొండూరివారి వీధి, జేపీఎన్ రోడ్డు దగ్గర, వరంగల్, తెలంగాణ రాష్ట్రం - 506002.

మరియు సదరు నోటీసులో తెలిపిన మొత్తం రూ.49,65,782.93 + వడ్డీ (నలభై తొమ్మిది లక్షల అరవై ఐదు వేల ఏడు వందల ఎనభై రెండు రూపాయల తొంభైమూడు పైసలు మాత్రమే)లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు 11 ఆగస్టు 2025న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారాలు జరపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం రూ.49,65,782.93 మరియు దానిపై వడ్డీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జీకు లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి రుణగ్రహీతకు లభించే సమయానానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

స్థిరాస్తి వివరణ

శ్రీమతి కాట్కూరి లత @రజితకు చెందిన వరంగల్, వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని మరియు వరంగల్ జేపీఎన్ రోడ్డు దగ్గర, కొండూరివారి వీధి వద్దగల 1245 చ.అ. ప్లింత్ ఏరియాతో 161.77 చ.గజాలు లేదా 135.24 చ.మీటర్ల విస్తీర్ణం గల కార్పొరేషన్ కొత్త నం.8-11-116 సంబంధించి మునిసిపల్ నం.8/1113 (పాతది), 8-11-120 (కొత్తది) కలిగిన నివాస భూమి మరియు భవనం ఇల్లు. సరిహద్దులు:- తూర్పు: రోడ్డు, పశ్చిమం: బి. చంద్రశేఖరం ఇల్లు, ఉత్తరం: జాయింట్ కామన్ ప్యాసేజ్, దక్షిణం: కుసుమ హరినాథ్ మందిర్.

తేదీ: 11.08.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: UMFB వరంగల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

శాయంపేట రోడ్డు శాఖ (1277)

శాయంపేట రోడ్, వరంగల్. ఫోన్ నెం. 8925951277

మెయిల్ ఐడి : iob1277@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-లవేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నం.54 ఆఫ్ 2002) క్రింద బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల అమ్మకం బ్యాంక్ బకాయిలు + దిగువ వివరించిన విధంగా వడ్డీ మరియు వ్యయాలు చెల్లించుటలో విఫలమైన మీదట బకాయిలు వసూలు కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అది" ప్రాతిపదికన దానిని విక్రయించు హక్కుతో పాటు దిగువ రుణ ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన ప్రకటనకు అనుగుణంగా దిగువ ఆస్తిని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు సదరు ఆస్తి/లు అమ్మకం ద్వారా బ్యాంక్ బకాయిలు వసూలు కొరకు ప్రతిపాదిస్తున్నారు. వెబ్ పోర్టల్: https://www.baanknet.com/ eauction-psb/home) or https://baanknet.com) వద్ద ఏర్పాటు చేయబడిన ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా దిగువ సంతకందారుచే అమ్మకం నిర్వహించబడును.

రుణగ్రహీత మరియు హామీదారులు/తనఖాదారుల పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ శ్రీ రాజరాజేశ్వరి ఎడిబుల్ వాటర్ ప్లాంట్ (రుణగ్రహీత), ప్రాతినిధ్యం వహిస్తున్న దీని ప్రొప్రయిటర్ : శ్రీమతి మాడ స్వప్న, డి.నం.20-315 & 20-316, జయా డీలక్స్ రోడ్ సమీపాన, పరకాల టౌన్ & మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506164. 2) శ్రీమతి మాడ స్వప్న (రుణగ్రహీత/తనఖాదారు), భర్త మాడ చక్రపాణి, నివాసం 20-315/1 & 20-316, జయా డీలక్స్ రోడ్ సమీపాన, పరకాల టౌన్ మరియు మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506164. 3) శ్రీ మాడ చక్రపాణి (హామీదారు), నివాసం ఇం.నం. 20-315/1 & 20-316, జయా డీలక్స్ రోడ్ సమీపాన, పరకాల టౌన్ మరియు మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506164 4) శ్రీ సుదమల్లా జగదీష్ (హామీదారు/తనఖాదారు) తండ్రి సుదమల్లా సమ్మయ్య, నివాసం ఇం.నం.20-315 & 20-316, జయా డీలక్స్ రోడ్ సమీపాన, పరకాల టౌన్ & మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506164. 5) శ్రీ సుదమల్లా రమేష్ (హామీదారు) తండ్రి సుదమల్లా సమ్మయ్య నివాసం.20-316 & 20-316, జయా డీలక్స్ రోడ్ సమీపాన, పరకాల టౌన్ & మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం-506164.

ఎన్‌పిఏ తేదీ: 31.03.2017, డిమాండ్ ప్రకటన తేదీ: 20.04.2017. డిమాండ్ ప్రకటనలో క్లెయిం చేసిన బకాయి మొత్తం: తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో 28.02.2017 నాటికి రూ.42,74,618/- స్వాధీనతా ప్రకటన తేదీ: 02.08.2017 & 17.10.2019. స్వాధీనతా ప్రకటనలో క్లెయిం చేసిన బకాయి మొత్తం: తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో 17.10.2019 నాటికి రూ.57,15,064/-, కాంట్రాక్చువల్ బకాయిలు: తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో 31.07.2025 నాటికి రూ.1,11,53,783/-. బకాయి మొత్తాలు : లేవు స్థానిక స్వీయ ప్రభుత్వ బకాయి మొత్తాలు (ఆస్తి పన్ను, నీటి పారిశుద్ధ్యం, విద్యుత్ బిల్లులు వగైరా).

ఆస్తి షెడ్యూల్ - 1

మెసర్స్ రాజ రాజేశ్వరి ఎడిబుల్ వాటర్ ప్లాంట్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని ప్రొప్రయిటర్ శ్రీమతి మాడ స్వప్నకు పేరున కలిగిన తెలంగాణ రాష్ట్రం- 506164, వరంగల్ జిల్లా, పరకాల టౌన్ మరియు మండలం, జయా డీలక్స్ రోడ్ వద్ద గల 353.89 చ.గజాలు ప్లింత్ ఏరియా(రోడ్ తర్వాత ప్రభావిత ప్రాంతం 45.11 చ.గజాలు) మొత్తం ప్లాట్‌తో ఒక్కొక్క అంతస్తు 1758.12 చ.అ.లు ప్లింత్ ఏరియా కలిగిన సర్వే నం.638/జి లో ఇం.నం.20-315 & 20-316 కలిగిన రెండు అంతస్తుల ఆర్‌సిసి ఇంటి ఆస్తి యావత్తు (గ్రౌండ్ ఫ్లోర్‌లో బిల్డింగ్ మరియు మొదటి అంతస్తులో ఫ్రేమ్ వర్క్). సరిహద్దులు: డాక్యుమెంట్ నం.1290/2012 ప్రకారం: ఉత్తరం: జిపి సిసి రోడ్, దక్షిణం: ఎస్.సమ్మయ్య ఇల్లు మరియు ఖాళీ స్థలం. తూర్పు: ఎస్.సమ్మయ్య ఖాళీ స్థలం, పశ్చిమం: ఎం.కాశయ్య ఖాళీ ప్లాట్.

ఆస్తి-1 వేలం వివరాలు :

ఇ- వేలం తేది మరియు సమయం:04.09.2025 (గురువారం) ఉ.11 గం.నుండి మ.01.00 గం. మధ్య. అమ్మకం పూర్తగునంతవరకు ఒక్కోదానికి 10 నిమిషాల ఆటోటైమ్ విస్తరణతో. రిజర్వు ధర : రూ. 57,00,000/-

బయానా : రూ. 5,70,000/- బయానా దాఖలు: రిజిస్ట్రేషన్ విజయవంతం అయిన తర్వాత, బ్యాంక్‌నెట్ బిడ్డర్ వ్యాలెట్ నుండి తీసుకొనబడుతుంది మరియు బ్యాంక్ ఖాతాలో తదనుగుణంగా జమ చేయబడుతుంది. బిడ్ పెరుగుదల మొత్తం: రూ.50,000/- (పెరిగే బిడ్‌కు సంబంధించి గుణాంకాలలో మొత్తం) బయానాతో బిడ్ దరఖాస్తు ఆన్‌లైన్ దాఖలు : 18.08.2025 నుండి బయానాతో బిడ్ కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు ఆఖరి తేదీ : 03.09.2025. ఆస్తి తనిఖీ: అధీకృత అధికారి ముందస్తు అనుమతితో అన్ని పని రోజుల్లో (ఉ.10.00 గం.నుండి సా.5.00 గం.వరకు)

ఆస్తి షెడ్యూల్-2 :

శ్రీ సుదమల్లా జగదీశ్ పేరున కలిగిన తెలంగాణ రాష్ట్రం-506164, వరంగల్ జిల్లా, పరకాల టౌన్ మరియు మండలం, జయా డీలక్స్ రోడ్ సమీపాన, ఇం.నం.20-315 (భాగం) కలిగిన వార్డ్ నం. 20లో సర్వే నం.638/జి లో 219.85 చ.గజాలు విస్తీర్ణంతో ఖాళీ స్థలం మరియు ఇంటి ఆస్తి యావత్తు. డాక్యుమెంట్ నం.1825 ఆఫ్ 2-12 ప్రకారం సరిహద్దులు : ఉత్తరం: శ్రీమతి మాడ స్వప్న ఇల్లు మరియు జిపి సిసి రోడ్, దక్షిణం: ఆర్.భిక్షపతి మరియు ఇతరుల ఇల్లు. తూర్పు: బి.భద్రయ్య ఇల్లు, పశ్చిమం: ఎం.కాశయ్య ఖాళీ ప్లాట్.

ఆస్తి 2 వేలం వివరాలు :

ఇ-వేలం తేది మరియు సమయం: 04.09.2025 (గురువారం) ఉ.11 గం.నుండి మ.01.00 గం. మధ్య. అమ్మకం పూర్తగునంతవరకు ఒక్కోదానికి 10 నిమిషాల ఆటోటైమ్ విస్తరణతో. రిజర్వు ధర : రూ. 19,00,000/-

బయానా : రూ. 1,90,000/- బయానా దాఖలు: రిజిస్ట్రేషన్ విజయవంతం అయిన తర్వాత, బ్యాంక్‌నెట్ బిడ్డర్ వ్యాలెట్ నుండి తీసుకొనబడుతుంది మరియు బ్యాంక్ ఖాతాలో తదనుగుణంగా జమ చేయబడుతుంది.బిడ్ పెరుగుదల మొత్తం: రూ.20,000/-(పెరిగే బిడ్‌కు సంబంధించి గుణాంకాలలో మొత్తం) బయానాతో బిడ్ దరఖాస్తు ఆన్‌లైన్ దాఖలు : 18.08.2025 నుండి బయానాతో బిడ్ కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు ఆఖరి తేది : 03.09.2025. ఆస్తి తనిఖీ: అధీకృత అధికారి ముందస్తు అనుమతితో అన్ని పని రోజుల్లో (ఉ.10.00 గం.నుండి సా.5.00 గం.వరకు) చట్టబద్ధ బకాయిలపై బ్యాంక్ బకాయిలకు ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది.

నియమనిబంధనల కొరకు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వెబ్ పోర్టల్ https:// www.banknet.com/eauction-psb/home) or https://baanknet.com ను దర్శించగలరు. కాబోరు టెండరు దారులు అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారిని కార్యాలయ పని వేళల్లో ఫోన్ నం.7989239293, మొబైల్ నం.: 8925951277 ను లేదా బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s. PSB అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్, చిరునామా: యూనిట్ 1,3వ అంతస్తు, విఐఓఎస్ కమర్షియల్ టవర్, వదాల ట్రక్ టర్మినల్, వదాల ఈస్ట్, ముంబై- 400037. ఫోన్ నం: 8291220220, ఇ-మెయిల్ support.BAANKNET@psballiance.com. (https://www.banknet.com/eauction-psb/home) or https://baanknet.com) పై సంప్రదించవచ్చును.

ప్రదేశం: వరంగల్. సం/- అధీకృత అధికారి,
తేది: 14.08.2025 ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్



రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన వరంగల్ కలెక్టర్ కార్యాలయం



ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

పంద్రాగస్టు పండుగ

- స్వాతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు
- హనుమకొండలో పరేడ్ గ్రౌండ్స్.. వరంగల్‌లో ఖుష్‌మహల్ మైదానం...
- పాల్గొననున్న మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్షం పడినా ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

హనుమకొండ/ఖిలావరంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హనుమకొండ, వరంగల్ జిల్లాలు ముస్తాబయ్యాయి. హనుమకొండ జిల్లాకు సంబంధించి ప్రధాన వేడుకలు జరగనున్న పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రౌండ్ లో ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అతిథుల కోసం వర్షం వచ్చినా తడవకుండా వాటర్‌ప్రూఫ్ షామియాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు సైతం ఇబ్బంది లేకుండా గ్రౌండ్‌ను పటిష్టపరిచారు. గురువారం సాయంత్రం పరేడ్‌లో గౌరవ వందనంలో పాల్గొనే పోలీసు సిబ్బంది రిహార్సల్స్ చే శారు. గ్రౌండ్‌ను ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఉదయం 9.28 గంటలకు మంత్రి గ్రౌండ్‌కు చేరుకుంటారు. 9.30 గంటలకు జెండాను ఎగురవేస్తారు. 9.35 నుంచి 9.50 గంట ల వరకు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 9.50 నుంచి 10.05 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10.05 నుంచి 10.20 వరకు పరేడ్ మార్చ్ ఆఫ్ ఉంటుంది. 10.20 నుంచి 10.20 గంటల వరకు మంత్రి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. అనంత రం వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, తర్వాత ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం ఉంటాయి. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను మంత్రి సురేఖ సందర్శిస్తారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కలెక్టర్ కార్యాలయాన్ని, కలెక్టర్ బంగ్లాను, అంబేద్కర్ సెంటర్‌ను, హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్‌హాల్‌ను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యకూడళ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

వరంగల్ జిల్లా కేంద్రంలో...

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు వరంగల్ జిల్లా కేంద్రం ముస్తాబైంది. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో జరిగే వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను గురువారం కలెక్టర్ సత్యశారద.. డీసీపీ అంకిత్ కుమార్, షేక్ సలీమా, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సభా వేదిక, సదుపాయాలు, గ్యాలరీలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా త నిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. వేదిక సమీపంలోని ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించిన కలెక్టర్ స్థానిక పోలీసులు, ట్రాఫిక్ అధికారులతో చర్చించి తగిన మార్గదర్శకాలను జారీ చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఏసీపీ శుభం ప్రకాశ్, డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, నగరపాలక సంస్థ, పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు.



ఖిలావరంగల్ మధ్యకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

జెండా ఎగురవేయనున్న మంత్రి పొంగులేటి

ఖిలా వరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఉదయం 9.40గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం, 9.50నిమిషాలకు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 10.10నిమిషాలకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వివిధ ప్రభుత్వశాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

అడిషనల్ డీసీపీ రవికి ఇండియన్ పోలీస్ మెడల్



వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పరిపాలన విభాగం అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్న నల్లమల రవిని ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండ ప్రాంతానికి చెందిన అడిషనల్ డీసీపీ నల్లమల రవి.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి 1991లో ఎస్సైగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం మెదక్ జిల్లాలోని శివంపేట, తుఫ్రాన్, మునిపల్లె పోలీసు స్టేషన్‌లలో పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది అమ్రాబాద్, మిర్యాలగూడ, సదాశివపేట సర్కిల్ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. అలాగే సంగారెడ్డి, జహీరాబాద్ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం అడిషనల్ డీసీపీగా, కరీంనగర్ పోలీసు ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. నక్సల్ ప్రాబల్యం ఉన్న పోలీసు స్టేషన్‌లలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా విజయవంతంగా విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి పలు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు మెడల్ ఎంపికైన అడిషనల్ డీసీపీ రవిని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

నమ్మించి మోసం చేశాడు..



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

- క్రెడిట్ కార్డుల ద్వారా డబ్బులు స్వాహా
- డిజిటల్ సేవా షాప్ నిర్వాహకుడి చీటింగ్
- కస్టమర్లకు చెందిన రూ.28 లక్షలు సొంతానికి వాడకం
- బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

6

16న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్కూల్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా స్థాయి అండర్-15, 17 బాలబాలికల వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ వి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15బాల బాలికల వాలీబాల్ విభాగంలో హనుమకొండ జేఎన్‌ఎస్ లోని వాలీబాల్ కోర్టులో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియేల్ పాఠశాలలో అండర్ -15,17 బాలుర ఫుట్‌బాల్ క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్ అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఎంపిక పోటీల్లో 1 జనవరి 2010 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఫుట్‌బాల్ అండర్-15 బాలుర విభాగంలో 1జనవరి 2011 తరువాత జన్మించిన వారు, అండర్-17 బాలుర ఫుట్‌బాల్ విభాగంలో 1జనవరి 2009 తరువాత జన్మించిన క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు 18, 19 తేదీల్లో సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫుట్‌బాల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు 20, 21 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు 16న ఉదయం 8గంటలకు హనుమకొండ జేఎన్‌ఎస్, కాజీపేట ఫాతిమా నగర్‌లోని సెయింట్ గ్యాబ్రియేల్ పాఠశాలలో రిపోర్టు చేయాలని ప్రశాంత్‌కుమార్ ప్రకటనలో కోరారు. వివరాలకు క్రీడాపోటీల కన్వీనర్లు పార్థసారథి 9849760799, రాముడు 9848658184 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

తొలగిన ఉత్కంఠ

డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలం గడువు పొడిగింపు

మరో 6 నెలలు పొడిగించిన ప్రభుత్వం

సంబురాల్లో పాలకవర్గం సభ్యులు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్ పాలకవర్గాల గడువు పెరిగింది. మరో 6 నెలల పాటు లేదా ఆపై ఉత్తర్వుల జారీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)తోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలు మరో 6 నెలలు బాధ్యతలు నిర్వహించనున్నాయి. ప్రస్తుత డీసీసీ బ్యాంకు పాలకవర్గం గడువు గురువారంతో ముగిసింది. ఇదేరోజున ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో కొద్ది రోజులుగా పాలకవర్గం రద్దు లేదా కొనసాగిస్తారా అనే అంశాలపై నెలకొన్న ఉత్కంఠకు సర్కారు తెరదించింది.

రూ.2వేల కోట్లకు పైగా టర్నోవర్ దశకు..

డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ఇతర పాలకవర్గ సభ్యుల కృషితో బ్యాంకు ఐదేళ్లలో అంచెలంచెలుగా ప్రగతి మెట్లను అధిరోహించింది. యేటా చైర్మన్ రవీందర్‌రావు బ్యాంకు ఆర్థిక లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆ మేరకు ఫలితాలను సాధిస్తూ వచ్చారు. పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయడంతో ఐదేళ్ల కిందట రూ.500 కోట్లతో ఉన్న బ్యాంకు టర్నోవర్ 2025 జనవరిలో రూ.2వేల 300 వందల కోట్ల టర్నోవర్ దశకు చేరింది. కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడుతూ రైతులకు సంబంధించినదే కాకుండా అన్ని వర్గాలకు సేవలు అందించేదిగా డీసీసీ బ్యాంకు సేవలు విస్తృతం అయ్యాయి. ఈ ఫలితాలను సాధిస్తూ 'ఏ' గ్రేడ్‌ను సాధించడం, బెస్ట్ గ్రోథింగ్ అవార్డును సొంతం చేసుకుంటూ బ్యాంకు మెరుగైన ఫలితాలను సాధిస్తోంది. ఈ క్రమంలోనే ఏడాది కిందట డీసీసీ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా కూడా నియమితులు కావడం బ్యాంకు అభివృద్ధికి మరింత కలిసి వచ్చిన అంశంగా మారింది. టర్నోవర్ లక్ష్యాన్ని రూ.2600 కోట్లకు పెంచాలనే తదితర నిర్ణయాలను పాలకవర్గం తీసుకుంది. అయితే గడువు పెరగడంతో టర్నోవర్ తదితర లక్ష్యాల సాధనకు పాలకవర్గానికి అవకాశం దక్కింది.

సంబురాలు

గడువు పొడిగింపుతో హైదరాబాద్‌లోని టెస్కాబ్ కార్యాలయంలో చైర్మన్ మార్నెనీ రవీందర్‌రావుతో పాటు వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, బోజారెడ్డి తదితరులు సంబురాలు జరిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

నేడు బ్యాంకు కార్యాలయంలో సంబురాలు

పాలకవర్గాల పదవీకాలం పొడిగింపును పురస్కరించుకొని డీసీసీ బ్యాంకు, జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలు శుక్రవారం సంబురాలకు సిద్ధమయ్యాయి. హనుమకొండ నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు.

మరింత బాధ్యతతో పనిచేస్తాం

మార్నేని రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

డీసీసీ బ్యాంకు, సహకార సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించడం ఆనందం కలిగించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. సంఘాల బలోపేతానికి మరింత అంకితభావంతో కృషి చేస్తాం. 19 నుంచి 32 బ్రాంచిల వరకు బ్యాంకు సేవలను విస్తరించాం. రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడుతూ అన్నివర్గాలకు రుణాలు అందచేస్తున్నాం.

మత్తు రహిత సమాజమే మనందరి లక్ష్యం

వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



మాట్లాడుతున్న సీపీ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థ రహిత సమాజం కోసం అందరం సమష్టిగా పనిచేద్దామని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. నెలవారి సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం సమావేశ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. వరంగల్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న అధికారులతో నిర్వహించిన సమీక్షలో ముందుగా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు పెండింగ్‌కు గల కారణాలను సంబంధిత ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్ కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నియంత్రణకు విద్యాసంస్థల పరిసరాలతో పాటు నిర్మానుష్య ప్రదేశాలపై పోలీసు అధికారులు నిఘా పెట్టాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పోలీసు అధికారులు వారివారి పోలీసుస్టేషన్‌ల పరిధిలో అకస్మికంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సిగరేట్ వినియోగంపై నిషేధం అమలులో ఉన్నందున వినియోగంపై పోలీసులు నిఘా పెట్టాలన్నారు. గంజాయి కేసుల్లో అధికారులు ప్రధాన నిందితుల అరెస్టుకు ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. నేరాల నియంత్రణకు పోలీసుస్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సీసీ కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా మద్యం దుకాణ యజమానులను ఆదేశించాలన్నారు. చోరీ కేసులకు సంబంధించి ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకుగాను సీసీఎస్ పోలీసు, స్థానిక పోలీసులు సంయుక్తంగా కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు.

పోలీసు స్టేషన్‌ల పనితీరుపై సీపీ మాట్లాడుతూ.. ప్రతీ స్టేషన్‌లోని మహిళా పోలీసు అధికారులను పోలీసు స్టేషన్ సంబంధించి అన్ని రకాల విధుల్లోనూ వినియోగించుకోవల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా సిబ్బంది యోగక్షేమాల పట్ల అధికారులు దృష్టి సారించాలన్నారు. వారికి ఏదైనా వ్యక్తిగత, శాఖాపరమైన సమస్య ఉంటే సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఈసమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజ మహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ, ఏఎస్పీలు, శుభం, చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావుతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు, రేపు సాహిత్య సంగీత నృత్యోత్సవం

వడ్డేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని వరంగల్ చౌరస్తాలోని రాధాకృష్ణ గార్డెన్స్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో సాహిత్య సంగీత నృత్యోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాకతీయ మ్యూజిక్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ వి.తిరుపతయ్య తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక విభాగం వారి ఆర్థిక సహాయంతో కాకతీయ మ్యూజిక్ అకాడమీ, బజ్జూరి ఆర్గనైజేషన్, కృష్ణా సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో స్థానిక, స్థానికేతర కళాకారులు కలిసి శ్రీకృష్ణుడిపై భక్తి పాటలు, కీర్తనలు, నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 99598 76698లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంస్థ సెక్రటరీ బిటవరం శ్రీమన్నారాయణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ ఇందారం నాగేశ్వర్‌రావు తదతరులు పాల్గొన్నారు.

బీరులో సోంపు ప్యాకెట్



బీరులో ఉన్న సోంపు ప్యాకెట్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లందలో గల ఓ వైన్స్ షాపులో కింగ్ ఫిషర్ బీరులో సోంపు ప్యాకెట్ రావడంపై మద్యం ప్రియులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మందు ప్రియులు బీరు కొనుగోలు చేసి సీల్ తీసి తాగుదామనుకునేసరికి సోంపు ప్యాకెట్ కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు. వైన్స్ షాపు యజమానులతో దీనిపై వాగ్వాదం చేస్తుండగా, కంపెనీ నుంచి వచ్చే వాటిని తామేమీ చేయలేమని, చెపుతూ సోంపు వచ్చిన బీర్లను వాపస్ తీసుకుని మరో బీరు అందించి మందు ప్రియులకు నచ్చచెపుతున్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని సామాజిక అభివృద్ధికి ఉపయోగించాలి

- డీఐవో డాక్టర్ శ్రీధర్ సుమన్
- తెలుగు స్వాతంత్ర్య పోరాటయోధుల ఫొటో ఎగ్జిబిషన్
- రెండు రోజులుగా కొనసాగుతున్న ప్రదర్శన



మాట్లాడుతున్న డీఐవో డాక్టర్ జి శ్రీధర్ సుమన్

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వేచ్ఛా వాయువులు అందించేందుకు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయుల స్ఫూర్తిని నేటి యువత గ్రహించాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ వరంగల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏవీవీ కాలేజీలో ఏర్పాటు చేసిన తెలుగు స్వాతంత్ర్య పోరాట యోధుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాట యోధులు చేసిన త్యాగ ఫలితంగా భారతదేశం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. యువత బాధ్యతాయుత ప్రవర్తనతో వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. తెలుగు పోరాట యోధుల చిత్ర ప్రదర్శన ఏర్పాటు అభినందనీయమని అన్నారు.

మేరా యువ భారత్ జిల్లా అధికారి చింతల అన్వేష్ మాట్లాడుతూ.. యువత తమకు ఇష్టమైన అంశాలలో చూపిన ఉత్సాహం కంటే జీవితాన్ని గొప్పగా మలచుకునేందుకు దోహదపడే ఇలాంటి ఫొటో ఎగ్జిబిషన్ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవీవీ విద్యా సంస్థల లైఫ్‌టైమ్ మెంబర్ చందా శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడైన తమ తాత చందా కాంతయ్య త్యాగాన్ని ఈ ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా గుర్తు చేసుకున్నామని పేర్కొన్నారు. త్యాగధనుల గురించి తెలియచేసే వేదికగా ఏవీవీ కళాశాలను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఏవీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. యువత చెంతకు ఫొటో ఎగ్జిబిషన్ రూపంలో వచ్చిన అరుదైన సమాచారాన్ని తమ జ్ఞానసంపద పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్ రెడ్డి ప్రసంగిస్తూ.. తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగశీలతకు ఫొటో ఎగ్జిబిషన్ అద్దం పట్టిందని అన్నారు. ఫొటో ఎగ్జిబిషన్ నిర్వాహకుడు, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి సూరునేని శ్రీధర్ పొందుపరిచిన అరుదైన చిత్రాలు, వివరాలను ఈ సందర్భంగా వివరించారు. తెలుగు స్వాతంత్ర్య సమరయోధుల గురించి నేటి యువత, ప్రజానీకానికి సమగ్ర వివరాలు తెలిసి ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 14,15 తేదీల్లో రెండు రోజులు కొనసాగే ఈ ప్రదర్శనను వీక్షించాలని సూచించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పురస్కరించుకొని స్కూల్, కాలేజీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అతిథులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు.

నమ్మించి మోసం చేశాడు

- క్రెడిట్ కార్డుల ద్వారా డబ్బులు స్వాహా
- డిజిటల్ సేవా షాప్ నిర్వాహకుడి చీటింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కమీషన్ తీసుకోకుండా క్రెడిట్ కార్డుల ద్వారాడబ్బులు ఇప్పిస్తానంటూ లక్షల్లో డబ్బుల స్వాహా చేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ నరసింహరావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నేరెళ్ల అరుణ్ 2023లో హనుమకొండ రాయపురలో భద్రకాళి డిజిటల్ సేవా షాప్ పెట్టి అన్‌లైన్ అప్లికేషన్స్ చేసేవాడు. తరువాత ఇన్‌స్టాముద్ర యాప్‌కి, షాడ్వాల్ పే యాప్‌కి ఫీజు కట్టి డిస్ట్రిబ్యూటర్ ఐడీ తీసుకున్నాడు. తన దగ్గరికి డబ్బు అవసరం నిమిత్తం వచ్చే కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. ఇందుకు గాను వీసా కార్డుకి 1.8శాతం, మాస్టర్ కార్డుకి 2.6శాతం బిజినెస్ కార్డు 4శాతం, రూపే కార్డుకి 1.8శాతం వారిగా డబ్బులు తీసుకునేవాడు. తన దగ్గరికి తరచుగా వచ్చే కస్టమర్లను తన వ్యాలెట్‌లో యాడ్ చేసుకొని వారి క్రెడిట్ కార్డులలో బ్యాలెన్స్ ఉంటే వారికి ఫోన్ చేసి తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి.. వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎటువంటి చార్జెస్ లేకుండా తానే వారి క్రెడిట్ కార్డుల బిల్లులు కడతానని వారికి మాయమాటలు చెప్పి నమ్మించేవాడు.

కార్డులు స్వైప్ చేసిన తరువాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4 శాతం వరకు చార్జి తీసుకొని లాభపడేవాడు. తరువాత తన బ్యాంకు ఖాతా హోల్డ్ అయ్యిందని, రెండు రోజుల తరువాత ఎటువంటి కమీషన్ లేకుండా వారికి ఇస్తానని నమ్మించి కొన్ని రోజుల తరువాత వారి క్రెడిట్ కార్డు బిల్లులు కూడా తానే కట్టేవాడు. యేడాదిపాటు వారికి నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్ కార్డు బిల్లులు కడుతూ క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ అలా బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్‌లోన్, అప్పులు కట్టి తన కుటుంబసభ్యులకు కూడా డబ్బులు సర్దుబాటు చేసేవాడు.

అలా కస్టమర్ల క్రెడిట్ కార్డుల నుంచి సుమారుగా సుమారుగా రూ.28లక్షలు వాడుకున్నాడు. కస్టమర్లు తరచూ ఫోన్ చేయడంతో వారికి రేపు మాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఆ తరువాత తనవల్ల కాకపోవడంతో కొన్నిరోజులు ఎటైనా వెళ్లిపోతే కస్టమర్లు మర్చిపోతారనుకున్నాడు. ఈ క్రమంలోనే షాప్ మూసేసి విజయవాడకు వెళ్లిపోయాడు. గురువారం తన షాపు వద్దకు వచ్చి షాపు ఖాళీచేస్తుండగా పోలీసులు నిందితుడుని పట్టుకొని అదుపులోకి తీసుకొని విచారించగా తన నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన హనుమకొండ పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

వాహనాల కదలిక సమాచారం అందుబాటులో ఉండాలి

- మేయర్ గుండు సుధారాణి
- ఐసీసీసీ కేంద్రం తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థ వాహనాల కదలిక సమాచారం నిత్యం అందుబాటులో ఉండాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల ట్రాకింగ్ నిర్వహణ తీరును ఐటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాటాడుతూ.. వరంగల్ పోతన, హనుమకొండ బాలసముద్రంలోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో చెత్తను కొలవడానికి వేవింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాలని, శానిటేషన్ వాహనాల కదలికల పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలన్నారు. ఎన్ని వాహనాలు పని చేస్తున్నాయి? ఎన్ని వాహనాలు మరమ్మతులో ఉన్నాయి? ఏ వాహనం ఎక్కడ ఉంది? అనేది ట్రాకింగ్ సిస్టం ద్వారా తెలుసుకోగలగాలన్నారు. డోర్‌టూడోర్ చెత్త సేకరణ జరగాలని, జీపీఎస్‌కు సంబంధించిన వాహనాలకు మరమ్మతు ఉంటే వెంటనే రిపేర్లు చేయాలన్నారు. చెత్త తరలింపు వాహనాలు ప్రతీ రోజు మూడు ట్రిప్పులు చేసేలా చూడాలన్నారు. చెత్త తరలింపు వాహనాలు శుభ్రం చేసుకునేందుకు నల్లాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ మేనేజర్ రమేష్, ఐసీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతుపై డ్రైవర్లకు అవగాహన అవసరం

వాహన మరమ్మతులపై డ్రైవర్లకు ప్రాథమిక అవగాహన అవసరమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో చెత్త తరలింపు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డ్రైవర్లకు కేటాయించిన వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. డ్రైవర్లకు వాహనాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓరియంటేషన్ తరగతుల ద్వారా డ్రైవర్లకు వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో వాహనాలు మరమ్మతుకు గురైతే స్వయంగా రిపేరు చేసుకుని చెత్త తరలింపులో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. ప్రతీ చెత్త తరలింపు వాహనాలకు ప్రత్యేకంగా రిజిస్ట్రర్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాహన ప్రాథమిక సమాచారం నమోదు చేయాలన్నారు. వాహనం పూర్తి సమాచారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ మాధవిలత, డీఈ రాజ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్‌తో పాటు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

సంకీర్తన హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

లంబాడ హక్కుల పోరాట సమితి డిమాండ్



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఎంఎల్‌సీ కేసులో తప్పుడు నివేదికను సమర్పించిన సంకీర్తన హాస్పిటల్ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. నాయకుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతల తండా మాజీ సర్పంచ్ బోనోత్ గణేష్ నాయక్‌పై గత నెల 21న కొందరు దాడిచేసి గాయపర్చారని పేర్కొన్నారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బానోత్ గణేష్ నాయక్‌ను అదే రోజు హనుమకొండలోని సంకీర్తన హాస్పిటల్‌కు తరలించారన్నారు. అక్కడ ఈఎస్‌ఐ హాస్పిటల్ ఉద్యోగిగా, సంకీర్తన హాస్పిటల్ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జాటోత్ రవికుమార్ చికిత్స అందించారని తెలిపారు.

అయితే చికిత్స అందించిన డాక్టర్ జాటోత్ రవికుమార్ నిందితుల నుంచి ముడుపులు స్వీకరించి ఐసీపీ సెక్షన్స్ వర్తించకుండా సాధారణ కేసుగా చెన్నారావుపేట పోలీసులకు రిపోర్టు అందజేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో కూడా సదరు డాక్టర్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకుని, వైద్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్, ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత పుట్ట రవి మాదిగ, పీపుల్స్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ జాతీయ కన్వీనర్ ఉదయ్ సింగ్ నాయక్, గోర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు మంగీలాల్ నాయక్, జిల్లా అధ్యక్షుడు సురేందర్ చౌహాన్, అంగోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వరంగల్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. బరిలో నిలిచిన 25 మంది అభ్యర్థులకు గుర్తులను కేటాయించినట్లు ఎన్నికల అధికారి ఎం.వాల్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో ఇద్దరు అభ్యర్థులు, మహిళా కేటగిరిలో ముగ్గురు అభ్యర్థులు, ఓపెన్ కేటగిరిలో 20 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వారికి గుర్తులను కేటాయించడం జరిగింది. వరంగల్ మట్టెవాడలోని ఏవీవీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 21 న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లు తప్పనిసరిగా ప్రభుత్వంచే జారీ చేయబడిన ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకుని రావాలని ఎన్నికల అధికారి వాల్యానాయక్ ఆ ప్రకటనలో కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7720	5300
మక్కలు	2112	1521
కందులు	5723	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6200	3450
పల్లికాయ (పచ్చిది)	4900	1575
పసుపు (కాడి)	12003	9534
పసుపు (గోల)	10509	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	14000	11500
వండర్‌హాట్	15000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	14300	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

స్వాతంత్ర్యం.. మా జన్మహక్కని..

- స్వాతంత్ర్య పోరాటంలో గర్జించిన ఓరుగల్లు
- క్విట్ ఇండియా తొలి స్పందన ఇక్కడే
- ఖిలాఫత్ ఉద్యమంతో ప్రారంభం
- పూల్‌పాడ్‌లో మద్య నిషేధానికి తొలి బీజం
- ఊరూరా చరఖా ఉద్యమం
- గాంధీజీ రాకతో కొత్త చైతన్యం
- సర్వస్వం త్యాగం చేసిన ఎందరో యోధులు
- 1920 -1948 మధ్య పోరాట ఘట్టాలెన్నో..

దేశమాత సంకెళ్లను తెంచడానికి భారత ప్రజలు నాడు జరిపిన పోరాటంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కూడా ప్రముఖ పాత్ర పోషించింది. అటు స్వాతంత్ర్యోద్యమం, ఇటు హైదరాబాద్ రాష్ట్ర విమోచనోద్యమం... ఏక కాలంలో రెండు ఉద్యమాలను పటిష్ఠంగా నిర్వహించిన అపూర్వమైన, ఉద్విగ్నమైన ఉద్యమ చరిత్ర కలిగిన జిల్లా ఇది. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టారు. జీవితాలను త్యాగం చేశారు. సత్యాగ్రహాలు చేశారు. జైళ్లకు వెళ్లారు. బ్రిటిష్‌వారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు మహాత్మా గాంధీ ఇచ్చిన అన్ని పిలుపులను ప్రజలు అందిపుచ్చుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రధాన ఘట్టంగా నిలిచిన 1920 నాటి ఖిలాఫత్ ఉద్యమం నుంచి ప్రారంభమైన జిల్లా ప్రజల పోరాటం 1948 నిజాం ప్రభువును గద్దె దించే వరకూ కొనసాగింది. 79 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగిన ప్రధాన ఘట్టాలను ఒకసారి అవలోకిద్దాం.

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 1920లో మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చింది. వరంగల్ జిల్లా ప్రజలు కూడా విదేశీ పాలనపై సమర శంఖం పూరించారు. అదే వరంగల్ జిల్లా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మొదటి ఘట్టం. ఖిలాఫత్ ఉద్యమం జిల్లాలో 1920 మార్చి, ఏప్రిల్ మాసాల్లో తీవ్ర స్థాయిలో జరిగింది. జనగామ ప్రాంతంలో పెద్ద ఎత్తున సాగింది. గాంధీజీ ఆశయాలైన ఖద్దర్ దుస్తుల వాడకం, మద్యపాన నిషేధానికి ఆయన పిలుపు మేరకు జిల్లా స్వాతంత్ర్య సమర యోధులు నలుమూలల ప్రచారం చేశారు.

ప్రజలంతా ఉద్యమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా దేశభక్తి భావనను వ్యాప్తి చేశారు. ఆచరణలో ఆయా కార్యక్రమాలను సఫలం చేసేందుకు స్వదేశీ ఉద్యమానికి ఊపునిచ్చేందుకు వరంగల్ ఖద్దర్ నూలు వడికే చరఖాలను తయారు చేసే ఖార్ఖానాలను స్థాపించారు. వాటిని జిల్లాలోని మారుమూల పల్లెలకు సైతం పంపిణీ అయ్యేలా చూశారు. మద్యపాన వ్యతిరేక ప్రచారంలో భాగంగా పూల్‌పాడ్ గ్రామంలో వందలాది మంది ప్రజలు తాము మద్యం ముట్టబోమని ప్రమాణం చేశారు. ఆ విధంగా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మద్యపాన నిషేధ కార్యక్రమానికి ఆ రోజుల్లోనే వరంగల్ జిల్లాలో బీజం పడింది. ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తుంటే మరో వైపు హైదరాబాద్ నిజాం రాజు బెంబేలెత్తిపోయాడు. అందువల్ల స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని అణచివేయడానికి పూనుకున్నాడు. స్వాతంత్ర్య పోరాట యోధులపై అనేక ఆంక్షలు విధించాడు. అడుగడుగునా నిర్బంధాలు సృష్టించాడు.



ఆంధ్రజన సంఘం సభ

1920 దశకంలో స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు దేశంలో బలీయంగా వీస్తున్న తరుణంలో నిజాం రాజ్యంలోని తెలంగాణ ప్రాంతంలో నిజాం రాష్ట్ర ఆంధ్రజన సంఘం, ఆంధ్ర జన కేంద్ర సంఘం ఏర్పడి ప్రజల్లో విద్యా వికాసానికి కృషి చేస్తుండేవి. 1924 ఏప్రిల్ 1న ఆంధ్రజన సంఘం హనుమకొండలో మొట్టమొదటి సమావేశాన్ని నిర్వహించింది. ఆంధ్రజన సంఘానికి బలీయమైన రాజకీయ ఉద్దేశాలు లేకపోయినా నిజాం నిరంకుశ పాలనను ఎదిరించే దిశగా ప్రజలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. నాడు ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దలు స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేశారు. వారిని మరింత ఉత్తేజితులను చేశారు.

స్వదేశీ ఉద్యమం

1933లో స్వదేశీ ఉద్యమాన్ని విజయవంతం చేసే దిశగా వరంగల్ ఒక్కుమ్మడిగా ముందుకు కదిలింది. స్వదేశీ ఉద్యమాన్ని పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా చరఖాలను హైదరాబాద్ నుంచి తెప్పించి శిక్షణ ఇప్పించారు. స్వదేశీ పత్రికల ముద్రణ, స్వదేశీ పుస్తక విక్రయశాలలను నెలకొల్పారు. ప్రజలకు చౌకగా పుస్తకాలను విక్రయించడం, ఖాదీధారణ, ప్రచారం మొదలైనవాటిని చేపట్టారు. ఎంఎస్ రాజలింగం, బండారు వీరమల్లు ప్రసాద్, ఏటూరి వెంకటేశ్వర్‌రావు మొదలైనవారు 1932 నుంచి వరంగల్‌లో ఖాదీ ప్రచారాన్ని ఉక ఉద్యమంలా సాగించారు.

ఎంఎస్ రాజలింగం స్వయంగా శిక్షణ పొందడానికి 1941లో గాంధీజీ సేవా గ్రామ్‌లో చేరారు. రామా చంద్రమౌళి, రంగనాయకులు, దుగ్గిశెట్టి వెంకటయ్య, గొడిశాల శంకరయ్య, మద్ది జనార్దన్, కొమరగిరి నారాయణ మొదలైనవారు ఊరూరా తిరిగి ఖాదీని స్వదేశీ భావాలను ప్రచారం చేశారు.

ఆంధ్ర మహాసభలు

స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్వహిస్తున్న సంస్థల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతున్న తరుణంలో వరంగల్ జిల్లా నాయకులు మౌలికమైన నిర్ణయాలు తీసుకునేందుకు తొమ్మిదో మహాసభను 1942లో వరంగల్ జిల్లా ధర్మారం గ్రామంలో నిర్వహించారు. అంతకు ముందు ఏడో సదస్సును వరంగల్ జిల్లాలోని ధర్మసాగర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో నిర్వహించారు. స్వాతంత్య పోరాటంలో ప్రజలను మరింత భాగస్వాములను చేయడానికి ఆంధ్ర సారస్వత పరిషత్ మహాసభలను వరంగల్ కోటలో నిర్వహించారు.

జాయిన్ ఇండియా

రామానందతీర్థ ఇచ్చిన జాయిన్ ఇండియన్ యూనియన్ అన్న పిలుపు మేరకు 1947 ఆగస్టు 7 నుంచి వరంగల్ జిల్లాలో హర్తాళ్లు, పాఠశాలల బహిష్కరణ వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. మల్కాపూర్‌లో నిర్వహించిన ఆంధ్ర మహాసభల తర్వాత ఉద్యమం నుంచి కమ్యూనిస్టులు వేరయ్యారు. తత్ఫలితంగా ఆంధ్ర జాతీయ పక్షం నిర్మాణమైంది. బూర్గుల రామకృష్ణారావు, కుందుముల నర్సింహారావు, జమలాపురం కేశవరావు, కొండా వెంకటర రంగారెడ్డి, గెల్ల కేశవరావు, మాడపాటి హనుమంతరావు, పీవీ నరసింహారావు, టి.హయగ్రీవాచారి తెలంగాణ అంతటికీ ఉద్యమ సారథులుగా నిలిచారు. ఎట్టకేలకు 1947 ఆగస్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ ప్రజలంతా స్వేచ్ఛా వాయువులను పీలుస్తుండగా నిజాం ప్రభుత్వ పరిధిలోని తెలంగాణ ప్రాంత ప్రజలకు మాత్రం ఆ ఆనందం దక్కలేదు. ఆ తర్వాత జరిగిన నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా వరంగల్ ప్రజలు వీరోచితంగా పాల్గొన్నారు. 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్యతో అసలైన స్వేచ్ఛా ఫలాన్ని ఆస్వాదించారు.

గాంధీజీ రాక

1945 ఫిబ్రవరి 5న గాంధీజీ వరంగల్‌కు వచ్చారు. వరంగల్ ప్రతినిధిగా వెళ్లిన బండారు చంద్రమౌళీశ్వరరావు గాంధీజీ వరంగల్ సందర్శన కార్యక్రమాన్ని నిర్ణయించుకొని వచ్చారు. గాంధీజీ వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఘట్టం వరంగల్ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగింది. తండోపతండాలుగా వచ్చిన ప్రజలు, నాయకులు అక్కడికక్కడే రూ. 12వేలను సమీకరించి స్వాతంత్ర్యోద్యమ నిధిగా బాపూజీకి సమర్పించారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో..

1942లోనే మహాత్మాగాంధీ పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమానికి వరంగల్ జిల్లాయే ప్రప్రథమంగా స్పందించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఎంఎస్ రాజలింగం, శ్రీరాం చంద్రమౌళి, దుగ్గిశెట్టి వెంకటయ్య, ఆరెల్లి బుచ్చయ్య, బొలుగొడ్డు రంగనాయకులు, గొడిశాల కొమురయ్య, ఎలగందుల వైకుంఠం తదితర నాయకులను నిజాం ప్రభుత్వం 1942 అక్టోబర్ 8న అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఆ కాలంలోనే మహాత్మాగాంధీ ఓరుగల్లు గడ్డపై అడుగుమోపారు.

సత్యాగ్రహాలు

1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌ను ప్రారంభించినప్పుడు నిజాం ప్రభుత్వం దానిని నిషేధించింది. ప్రభుత్వ నిరంకుశ ధోరణులను ఎండగడుతూ వరంగల్ నుంచి తిరువరంగం హయగ్రీవాచారి, ఇటికాల మధుసూదన్‌రావు, పొట్లపల్లి రామారావు, బొలుగొడ్డు రంగనాయకులు వంటి పలువురు స్వాతంత్ర్య సమరయోధులు సత్యాగ్రహంలో పాల్గొని జైలుపాలయ్యారు. నిజాం ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయకపోవడంతో జిల్లా నాయకులు ప్రత్యామ్నాయంగా ఆర్య సమాజాన్ని వేదికగా ఎంచుకున్నారు.

జ్ఞాపకాలు తప్ప, స్మృతి చిహ్నాలేవి?

- పదిల పరచడంలో నిర్లక్ష్యం
- స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను రికార్డు చేయడంలో అలసత్వం



వరంగల్ కోటలో శిథిలావస్థలో ఉన్న మొగిలయ్య ఇల్లు

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నిర్వహించిన పాత్ర ఎనలేనిది. స్వాతంత్ర్యం కోసం సమరయోధులు తమ సర్వస్వాన్ని ధారపోశారు. అనేక మంది జైళ్లకు వెళ్లారు. రజాకార్ల చేతుల్లో కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో చరిత్ర పుటల్లో నిలిచిపోయే అనేక పోరాట ఘట్టాలు చోటు చేసుకున్నాయి. కానీ అవన్నీ ఇప్పుడు కేవలం జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయి. నాటి చారిత్రక ఘట్టాల స్మృతి చిహ్నాలు ఏ మాత్రం కనిపించడం లేదు. పాలకులు వాటిని సరైన రీతిలో పరిరక్షించకపోవడంతో క్రమంగా కనుమరుగై పోయాయి. జాతిని జాగృతం చేసే గత చరిత్రను రికార్డు చేసే ప్రయత్నం ఏదీ ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు జరగలేదు. ఆ దిశగా కనీసం ప్రయత్నాలు ప్రభుత్వం, జిల్లా పాలనా యంత్రాంగమూ చేయలేదు.

మొగిలయ్య హాల్..

ఒకప్పుడు స్వాతంత్ర్య సమర పోరాటానికి కేంద్రంగా, స్వాతంత్ర్య సమరయోధులకు ఒక వేదికగా నిలిచిన వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మొగిలయ్య హాల్ (స్మారక భవనం) క్రమంగా తన ఉనికిని కోల్పోతోంది. 1946లో వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసినందుకు రజాకార్లు జరిపిన దాడిలో హత్యకు గురైన బత్తిని మొగిలయ్య గౌడ్ స్మృత్యర్థం నిర్మించిన ఈ స్మారక మందిరంలో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు తరచూ సమావేశమయ్యేవారు. ఇందులో ఒక గ్రంథాలయాన్ని కూడా నిర్వహించేవారు. జాతీయ భావనల ఉద్దీపన కేంద్రంగా ఈ మందిరం విరాజిల్లింది. కానీ అది ఇప్పుడు అద్దెల ద్వారా ఆదాయం సమకూర్చిపెట్టే పక్కా కమర్షియల్ కాంప్లెక్స్‌గామారిపోయింది. అలాగే వరంగల్ కోటలో రజాకార్ల చేతిలో మొగిలయ్యగౌడ్ హత్యకు గురైన ప్రాంతాన్ని కూడా స్మారక ప్రదేశంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేదు. జాతీయ జెండా ఎగురవేసిన ప్రాంతాన్ని, మొగిలియ్య ఇంటిని సైతం పట్టించుకోలేదు. ఈ ఇల్లు క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది.

యోధుల జాడలేవీ?

నాటి స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న యోధులు ఎవరో ఈ తరం తెలుసుకునే సమాచారం ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదు. వారి జీవిత చరిత్రలు గానీ, ఫొటోలు గానీ ఎక్కడా కనిపించడం లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వరంగల్ నగరానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెక్కిన రెండు శిలాఫలకాలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ప్రతిష్ఠించడం మినహా అంతకు మించిన చర్యలేవి తీసుకోలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న సమరయోధులు అనేక మంది ఉన్నారు. వారి పేర్లను కూడా సేకరించి ఒక స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.



హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో మసక బారుతున్న స్వాతంత్ర్య సమరయోధుల పేర్లున్న శిలాఫలకం

ఓపెన్ ఎయిర్ థియేటర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు జమలాపురం కేశవరావు స్మారకార్థం హనుమకొండ బాలసముద్రంలోని ఆడిటోరియం కట్టాలన్న స్వాతంత్ర్య సమరయోధుల అభ్యర్థన అమలుకు నోచుకోలేదు. సమరయోధులు చాలాకాలం ఈ విషయంపై జిల్లా యంత్రాంగానికి వినతులు సమర్పించారు. ఈ పార్క్‌లో గతంలో ఒక ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉండేది. అక్కడే అన్ని హంగులతో ఆడిటోరియం నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమయ్యింది. ఈ స్థలంలో ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్ వెలిసింది.

గాంధీ పర్యటన చిహ్నాలేవీ?

వరంగల్‌లో మహాత్మాగాంధీ రాకకు సంబంధించిన ఒక్క స్మృతి చిహ్నం కూడా లేదు. 1945 ఫిబ్రవరి 5న గాంధీజీ వరంగల్‌కు వచ్చారు. గాంధీజీ వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ చారిత్రక ఘట్టం చోటు చేసుకున్న వరంగల్ రైల్వే స్టేషన్‌లో అందుకు సంబంధించిన స్మృతి చిహ్నాలు భద్రపరచలేదు.

పెన్సిల్ మొనపై జాతీయ జెండా



కాటారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు తన సూక్ష్మ చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. పెన్సిల్ మొనతో జాతీయ జెండాను చెక్కాడు. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన ఆర్ట్ టీచర్ రజనీకాంత్ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ సమగ్రత, భక్తిని చాటే జాతీయ పతాకంతో శుభాకాంక్షలను తెలిపేలా చిత్రాలను పెన్సిల్ గ్రాఫైట్ మొనపై, చాక్‌పీస్‌లపై తయారు చేశాడు. పెన్సిల్ మొనపై 4మి.మీ ఎత్తు, 2మి.మీ వెడల్పు గల జాతీయ జెండాను చెక్కాడు. చాక్‌పీస్‌లపై సైతం 7మి.మీ ఎత్తు, 5మి.మీ వెడల్పుగల త్రివర్ణ పతాకాలను స్కల్ప్చరింగ్, మైక్రో ఆర్ట్ ద్వారా తయారు చేశాడు.

రారా కృష్ణయ్య..

- రేపే శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం
- ఉత్సాహపూరితంగా సాగనున్న ఉట్టి కొట్టే వేడుకలు
- అన్న, వస్త్రదానం చేస్తే ఎంతో పుణ్యమని నమ్మకం



శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు (ఫైల్)

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించుకునేందుకు యాదవ కులస్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ పంచాంగం ప్రకారం ప్రతీ ఏడాది శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథినాడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున యువత ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమి వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుకుంటారు. శ్రీకృష్ణాష్టమి రోజున చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలో తయారు చేసి, పూజిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఈనెల 16న శనివారం జరుపుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు.

అష్ట ఘడియలు

ఆగస్టు 16 శనివారం ఉదయం 6 గంటల అష్టమి గడియలు ప్రారంభమై 7.30 అష్టమి ఘడియలు ప్రారంభమై ఉదయం 9 గంటలకు అష్టమి ఘడియలు ముగియనున్నాయి. ఉదయం 9 గంటల తర్వాత మంచిఘడియలు ఉన్నాయని వేద పండితులు పేర్కొన్నారు.

యాదవుల ప్రత్యేకం..

యాదవ కులస్థులు కృష్ణుడిని కులదైవంగా కొలుస్తారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేసి గ్రామాలు, పట్టణాల్లో వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి రోజున ఊయలలో కృష్ణుడి ప్రతిమలను ఉంచి కన్నులపండువగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా ముస్తాబుచేస్తారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహించి సహపంక్తి భోజనాలతో వేడుకలు ముగిస్తారు. ఉట్టి కొట్టే కార్యక్రమం అందరు కలిసి పాలొనడం వారిలోని ఐక్యతను పెంచుతోంది. ఈ వేడుకల్లో యాదవులతో పాటు ఇతర కులస్థులు సైతం పాల్గొని, పండుగను ఘనంగా జరుపుకుంటారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి రహస్యం

భాగవతం ప్రకారం పరమ రాక్షసుడైన కంసుని చెల్లెలు దేవకి తనకి ఆమె అంటే ఎంతో ఇష్టం. తనకు వసుదేవుడితో వివాహం జరిపించి, అత్తారింటికి పంపే సమయంలో ఆకాశవాణి తన చెల్లెలు కడుపులో 8వ సంతానంగా పుట్టిన కుమారుడు కంసుడుని అంతమొందిస్తాడని చెబుతుంది. దీంతో ఆగ్రహానికి గురైన కంసుడు తన చెల్లెలు దేవకి బావ వసుదేవులను కర్మాగారంలో బంధిస్తాడు. వారికి పుట్టిన బిడ్డలని పురిట్లోనే చంపేస్తుంటాడు. ఏడుగురు చిన్నారులను కోల్పోయిన దేవకి ఎనిమిదవ గర్భం దాలుస్తుంది. ఆ బిడ్డ తనఅంతు చూస్తాడని కంసుడుకి ముందే తెలుసు. కాబట్టి కారాగారం వద్ద భద్రతను మరింత పెంచుతాడు. అయితే నెలలు నిండిన దేవకి శ్రావణమాసంలో బహుళఅష్టమి రోహిణి నక్షత్రం వేళ అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించాడు. ఆ రోజును శ్రీకృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు.

ఏ వస్తువులు దానం చేయాలంటే..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన వైదిక క్యాలెండర్ ప్రకారం శ్రావణమాసం కృష్ణపక్షంలోని అష్టమి తిథి రోజున ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ద్వారా కుటుంబంలో ఆహార సమస్యలేకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. వెన్నదానం చేయం వలన దోషాలు తొలగిపోయి కుటుంబంలో శాంతి, సంతోషాలు నెలకొంటాయి. వస్త్రదానం చేయడం ద్వారా దుఃఖం, పేదరికం నుంచి ఉపశమనం పొందుతారు. నెమలి ఈకలు దానం చేయడం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయి వృత్తి, వ్యాపారంలో పురోగతి ఉంటుంది.

సాంకేతిక సంబురాలకు సన్నద్ధం

- కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ పండుగ
- ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహణ



సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్షలో పాల్గొన వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు కేయూ సన్నద్ధమవుతోంది. ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న కీలక మార్పులపై సదస్సులో దిశానిర్దేశం చేయనున్నారు. 2018లో వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మొదటి సదస్సు జరిగింది. రెండో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ తాజాగా కేయూకు దక్కింది. మూడు రోజుల పాటు జరిగే సదస్సులకు ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు హాజరు కానున్నారు. విద్యార్థులు, యువ పరిశోధకులకు సాంకేతిక రంగంలో చోటు చేసుకున్న అభివృద్ధిపై చక్కని సమాలోచనలు చేస్తారు. కేయూ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలను నిర్వహిస్తోంది. ఈ దఫా 'సాధికారత కోసం వినూత్న నైపుణ్యాలు, శాస్త్ర సాంకేతికతో యువ భారతాన్ని రూపాంతరం చెందేలా తోడ్పాటును అందించడం' అనే నినాదాన్ని థీమ్‌గా తీసుకున్నారు. సైన్స్ టెక్నాలజీలో విజ్ఞాన మార్పిడి, నూతన ఆవిష్కరణలపై మూడు రోజుల పాటు మేధోమథనం చేపడుతారు. ఆగస్టు 19న కేయూ స్వర్ణోత్సవ సంబురాల్లోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

5 కీలక ప్లీనరీలు

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను కీలకమైన 5 ప్లీనరీలను కేయూ ఆడిటోరియం వేదికగా నిర్వహిస్తారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, దేశంలో పేరెన్నికగల పరిశోధన సంస్థల డైరెక్టర్లు హాజరై శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి, భవిష్యత్ పరిశోధనలపై దిశానిర్దేశం చేస్తారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యూలర్ బయోలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ డాక్టర్ కె.వినయ్ కుమార్ నందికూరి, బెంగళూరులోని ఎల్ఆర్‌డీఈ (డీఆర్‌డీఏ) డైరెక్టర్ జి.విశ్వం, ఢిల్లీ, కేరళ త్రివేంద్రంలోని డీఆర్‌డీఏ డైరెక్టర్ మార్త ఎన్‌రెడ్డి, ఎన్‌వీ చలపతి, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ ఎన్.రఘురాం హాజరై కీలక ప్రసంగిస్తారు. వీరితో పాటు ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ ఇంజనీరింగ్, లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ, జియాలజీ విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్ వాసు సింగూరి, ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్, వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి, డీఎన్ రామకృష్ణ, ప్రొఫెసర్ మోరె రాములు, ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, ప్రొఫెసర్ డి.సాంబరెడ్డి, ఏఆర్‌సీ రెడ్డిలు హాజరుకానున్నారు.

సీనియర్ సైంటిస్టుల అనుభవాలను పంచుకునేందుకు సైన్స్ కాంగ్రెస్‌లో ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లతో పాటు జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిన డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు, డాక్టర్ వెంకటేశ్వరన్, డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌తో ప్రత్యేక స్టూడెంట్స్ ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని రూపొందించారు. అంతరిక్ష పరిశోధనపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. కేరళ త్రివేండ్రం, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్లు సిచాయ్ మణి, డాక్టర్ కె.కిశోర్ కుమార్‌తో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. సాంకేతిక రంగంలో భాగమైన ఆర్కిటెక్చర్‌తో పాటు హెరిటేజ్ రంగాలపై వరంగల్ నిట్ రిటైర్డు ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని ఐఐటీసీ చీఫ్ సైంటిస్టు సుంకర మనోరమ, హైదరాబాద్ ఆర్‌సీఐ డీఆర్డీవో చీఫ్ సైంటిస్టు వెంకటమణిలతో పాటు ఇతర మహిళా సైంటిస్టుల ప్రసంగిస్తారు. ఏఐ రంగంలో పేరొందిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ టి.కృష్ణారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ పద్మనాభన్ నాయర్‌లతో సదస్సులు నిర్వహిస్తారు. వీరితో పాటు కెమిస్ట్రీ, జియాలజీ రంగంలో ప్రఖ్యాతి గాంచిన పూణె ఎన్ఆర్‌సీ సైంటిస్టు ప్రొఫెసర్ కొతం రవీందర్, నాగపూర్‌లోని జియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ శేష సాయి, ఎన్‌జీఆర్ఎఫ్ ప్రొఫెసర్ పాండేలు హాజరుకానున్నారు.

750 రిసెర్చ్ అబ్‌స్ట్రాక్టులు.. 596 రిజిస్ట్రేషన్లు..

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు 750 మంది శాస్త్ర, సాంకేతిక అంశాలపై రీసెర్చ్ అబ్‌స్ట్రాక్టులు సమర్పించారు. అలాగే 596 మంది సదస్సుకు హాజరయ్యేందుకు ఆసక్తితో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మొత్తంగా 1346 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరితో పాటు వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొననున్నారు.

హైస్కూల్ విద్యార్థులకు అవకాశం

సాంకేతిక రంగాన్ని బలోపేతం చేసి యువతను ప్రోత్సహించేందుకు 9,10 తరగతుల స్కూల్ విద్యార్థులు, స్కూల్ సైన్స్ ఉపాధ్యాయులకు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో అవకాశం కల్పించారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్లు, జన విజ్ఞాన వేదిక బాధ్యులు ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణల నేతృత్వంలో విద్యార్థులతో శాస్త్ర సాంకేతిక అంశాలపై సరైన అవగాహన కల్పిస్తారు. దాదాపు 200 మంది విద్యార్థులకు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఆగస్టు 19న మధ్యాహ్నం విద్యార్థులు, ఆగస్టు 20న ఉపాధ్యాయులు పాల్గొనేందుకు అవకాశం ఉంది. 'అభివృద్ధి నిర్మాతలు - వికసిత్ భారతం కోసం యువత శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ సదానందం పర్యవేక్షణలో 12 మంది అనుభవజ్ఞులైన పేరుగాంచిన శాస్త్రవేత్తలో ప్యానల్ డిష్కషన్ నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ, కామర్స్, ఫార్మసీ కళాశాలల్లోని సెమినార్ హాల్‌లలో 7 చోట్ల ఒకే దఫా టెక్నికల్ సెషన్లు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన కీలక ఏర్పాట్లను పూర్తి చేశారు.

కేయూ దిక్సూచి.. 'వివేచన'

- 2006 నుంచి ఏటేటా రెండు ఎడిషన్లు ప్రచురణ
- వర్సిటీ అభివృద్ధిపై కీలక డాక్యుమెంట్

కేయూ క్యాంపస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ ప్రతిష్ఠకు నిలువెత్తు నిదర్శనంగా కాకతీయ వివేచన న్యూస్‌లెటర్ నిలుస్తోంది. యేటా జనవరి 26, ఆగస్టు 15న రెండు ఎడిషన్లను ప్రచురిస్తారు. వర్సిటీ అభివృద్ధి, అకడమిక్ అచీవ్‌మెంట్స్‌తో పాటు డాక్టరేట్ సాధించిన అభ్యర్థుల వివరాలను ప్రచురిస్తారు. 2006లో అప్పటి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జగన్నాథస్వామిల చొరవతో వర్సిటీ పురోభివృద్ధిపై ఏటేటా రెండు సంచికలను తీసుకురావాలనే ఆలోచన పురుడు పోసుకుంది. ఏడాదిలో రెండు విడతలుగా జనవరి, ఆగస్టు మాసంలో సాధించిన అచీవ్‌మెంట్‌పై చక్కని సమాచారాన్ని పుస్తకంగా ప్రచురిస్తున్నారు.

రెండు ఎడిషన్లు

కేయూ సమగ్ర సమాచారదర్శిని కాకతీయ వివేచన న్యూస్ లెటర్ ప్రతీ ఏడాదికి రెండు సంచికలు ప్రచురిస్తారు. జనవరి నుంచి ఆగస్టు 15 వరకు వర్సిటీలో జరిగే ప్రతీ ఈవెంట్‌తో పాటు ముఖ్యమైన సమాచారాన్ని సంక్షిప్తంగా న్యూస్‌లెటర్‌లో ప్రచురిస్తారు. అకడమిక్ ఈవెంట్లు, ఎంఓయూలు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్, విజిటర్స్, అదర్ ఈవెంట్స్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్, అవార్డు అండ్ అచీవ్‌మెంట్స్, స్పోర్ట్స్ అండ్ కల్చర్, ఎండోమెంట్ లెక్చర్స్, ఇంటర్నేషనల్ ఈవెంట్స్, సెమినార్స్, డెవలప్‌మెంట్ యాక్టివిటీస్, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో పాటు స్కాలర్స్, అధ్యాపకులు సాధించిన పురస్కారాలు, అవార్డులు, రివార్డులను ప్రచురిస్తారు. వీటితో పాటు పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన అభ్యర్థుల వివరాలు, విభాగాలు, గైడ్‌ల సమాచారాన్ని అందిస్తారు.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అందుబాటులోకి..

వర్సిటీలో ఏటా రెండు సంచికలను ఆఫ్‌లైన్‌లో ప్రచురించి అన్ని విభాగాలతో పాటు కార్యాలయాలకు అందచేస్తారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతారు. ఎవ్వరికీ ఎప్పుడు ఏ సమాచారం కావాలన్నా నేరుగా వర్సిటీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారికి కావాల్సిన సంచికను అప్పటికప్పుడూ చూసుకునే సదుపాయం ఉంది.

ఎడిటోరియల్ బోర్డు ఏర్పాటు

కాకతీయ యూనివర్సిటీ న్యూస్‌లెటర్ వివేచన ప్రచురణకు ఎడిటోరియల్ బోర్డు పనిచేస్తోంది వీసీ, రిజిస్ట్రార్లతో పాటు చీఫ్ ఎడిటర్, ఎటిటర్, ఎడిటర్ కన్వీనర్‌లు సహాయంతో పుస్తకాన్ని వెలువరిస్తారు.



వీర నాయకుల విగ్రహాలు శుద్ధి

వరంగల్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ తిలక్‌రోడ్డులోని తిలక్ విగ్రహం, వెంకట్రామ జంక్షన్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంతో పాటు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ నాయకులు గురువారం నీటితో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం పోరాటంచేసిన వల్లభాయ్ పటేల్, బాలగంగాధర్ తిలక్, దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేయడం, పూలతో అలంకరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రత్నం సతీష్ షా, ఆనంద్, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.



మార్కెట్‌లో మక్క బస్తాల చోరీ

- పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారి ఫిర్యాదు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓ వ్యాపారి కొనుగోలు చేసి నిల్వ పెట్టుకున్న మక్కజొన్నల బస్తాల చోరీ జరిగింది. దీంతో సదరు వ్యాపారి ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మార్కెట్‌లో మక్కజొన్నలను కొనుగోలు చేసిన వ్యాపారి కొద్ది రోజులుగా బస్తాలను పత్తి యార్డులో నిల్వ చేసుకుంటున్నాడు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు గత కొద్ది రోజులు కొన్ని కొన్ని బస్తాలను తస్కరిస్తున్నారు. విషయాన్ని పసిగట్టిన వ్యాపారి రాత్రివేళల్లో నిఘా పెట్టాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బస్తాలను తస్కరించేందుకు ఓ వాహనం రాగా అప్పటికే కాపుకాచి ఉన్న వారు వాహనదారుడిని నిలదీసి వ్యాపారికి సమాచారం అందించారు. దీంతో వ్యాపారి గురువారం పోలీస్‌స్టేషన్‌లో తనకు సంబంధించిన మక్కజొన్నల బస్తాలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

మధ్యకోటలో కూలిన రాతికోట ఆర్చి



మధ్యకోటలో వర్షాలకు కూలిపోయిన రాతికోట ఆర్చి

ఖిలావరంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖిలావరంగల్ మధ్యకోటలోని రాతి ఆర్చి కూలిపోయింది. దేశ విదేశాలలో పేరొందిన, చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలం నాటి మట్టికోట, రాతికోటతో పాటు నాలుగు కీర్తితోరణాలు, అద్భుత శిల్ప సంపద, దేవాలయాలు, నిర్మాణాలు, కట్టడాలు అనేకం ఉన్నాయి. అందులో భాగంగా ఖిలావరంగల్ మధ్యకోటలోని తూర్పు భాగంలో గల రాతికోట ఆర్చి ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయాయి. రాతికోట ఆర్చిని పునరుద్ధరించాలని స్థానికులతో పాటు పర్యాటకులు కేంద్ర పురావస్తు శాఖ అధికారులను కోరుతున్నారు.

వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ ఆదేశాలు తప్పకుండా పాటించాలి
- జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో కలిసి గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తప్పకుండా పాటించాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి శాఖ అధికారులు వారి పరిధిలో విధులను, బాధ్యతలను సజావుగా నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. కాజ్‌వేల మీద ఎవరూ ప్రయాణం చేయకుండా చూడాలని, చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తూ విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. పొంగి పొర్లుతున్న వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యసవర పరిస్థితుల్లో స్పందించేందుకు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 24గంటలు పనిచేస్తుందని తెలిపారు. విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్ 18004253424, 9154252936కు సమాచా రం అందించాలని కలెక్టర్ తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, డీపీవో కల్పన, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గౌతమ్‌రెడ్డి, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

నేడు రాజరాజేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం సెంటర్ వద్ద గల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసంలో ప్రతీ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు లక్ష్మణాచార్యులు తెలిపారు. మూడో శుక్రవారం సందర్భంగా ఉదయం 10 గంటలకు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించబడునని, వ్రతంలో పాల్గొనే మహిళలు పూజా సామగ్రి తమ వెంట తెచ్చుకోవాలని అన్నారు. పూజల అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని లక్ష్మణాచార్యులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసుల తనిఖీలు



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

గిర్మాజీపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీ) సీఐ పి.సురేందర్, రైల్వే రక్షిత దళం(ఆర్‌పీఎఫ్) సీఐ కె.శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షణలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది రైల్వేస్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికుల విశ్రాంతి మందిరాల్లో ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైళ్ల నుంచి దిగిన ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పి.దుర్గాప్రసాద్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఎన్.రవీందర్, కానిస్టేబుళ్లు రియాజొద్దీన్, భార్గవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డీఈవో దిష్టిబొమ్మ దహనం



వరంగల్ కలెక్టరేట్ ఎదుట డీఈవో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీఎస్ఎఫ్ కార్యకర్తలు

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిని ఎంఈవోల సమావేశంలోదూషించడాన్ని నిరసిస్తూ వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆయన దిష్టిబొమ్మను దహనం దేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ మాట్లాడుతూ.. డీఈవోపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నోటి దురుసుతో అందరితో అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్న డీఈవోపై ఉన్నతాధికారులు కలెక్టర్, డీఎస్సీ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

లింగ సమానత్వంపై అవగాహన పెంచుకోవాలి

కరీమాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లింగ సమానత్వంపై అవగాహన పెంచుకోవాలని వాయిస్ ఫర్ గర్ల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూష భరద్వాజ్, ప్రిన్సిపాల్ జె.అంజిరెడ్డి అన్నారు. వరంగల్ ఉర్సుగుట్టలోని తెలంగాణ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వాయిస్ ఫర్ గర్ల్స్ ఎన్‌జీవో శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించింది. శిక్షణ శిబిరాన్ని ఫీల్డ్ కోఆర్డినేటర్ ఓంకార్ మెనీ యార్, కౌన్సిలర్లు సలీం పాషా, వినయ్ నడిపించనున్నట్లు వారు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే శిబిరంలో విద్యార్థుల లైంగిక, మానసిక ఆరోగ్య సంబంధాలు, హక్కులు, బాధ్యతలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నిరుపేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- వాసవి క్లబ్ అధ్యక్షుడు వీరన్న



చెక్కు అందజేస్తున్న తొనుపునూరి వీరన్న

మట్టెవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):పేద ఆర్యవైశ్యులకు వరంగల్ వాసవి క్లబ్ ఎల్లవేళలా అండగా ఉంటుందని వరంగల్ వాసవి క్లబ్ అధ్యక్షుడు, భద్రకాళి దేవస్థానం ధర్మకర్త తొనుపునూరి వీరన్న అన్నారు. గురువారం వరంగల్ పిన్నవారి వీధిలోని వాసవి క్లబ్ భవనంలో వరంగల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో 9వ తరగతి చదువుతున్న కొదుమూరి లక్ష్మియశస్వికి సరస్వతి పథకం ద్వారా రూ.5వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లబ్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలను అర్హులైన పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్యాల వీరమల్లయ్య, జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్ శైలజ, వాసవి క్లబ్ కోశాధికారి ఉప్పల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపం నిర్మాణానికి భూమి పూజ

వరంగల్‌సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాశిబుగ్గలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కాశిబుగ్గ వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం మండప నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిష్ణమూర్తి మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొన్నేళ్లుగా మట్టి గణపతులను ప్రతిష్ఠిస్తూ ఉత్తమ బహుమతులను కూడా అందుకోవడం జరిగిందని గుర్తుచేశారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా స్థానిక లక్ష్మీగణపతి పరపతి సంఘం ప్రతినిధులు కూడా సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు వడిచర్ల సదానందం, బయ్య స్వామి, గుండేటి నరేంద్రకుమార్, మండల శ్రీరాములు, గుల్లపెల్లి రాజ్‌కుమార్, గోనె జగదీశ్వర్, బిట్ల చక్రపాణి, వి.నాగరాజు పాల్గొన్నారు.



గణేష్ మండపం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గుండేటి క్రిష్ణమూర్తి

ఘనంగా కార్పొరేటర్ నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలు



నరేంద్రకుమార్‌కు శాలువా కప్పి స్వీటు తినిపిస్తున్న సారయ్య

వరంగల్‌సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తన నివాసంలో గురువారం స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, 21వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నరేంద్రకుమార్‌కు సారయ్య శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేంద్రకుమార్ కేక్ కట్‌చేసి స్వీట్లు, కేకను నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమాన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దూపం సంపత్, కరాటే ప్రభాకర్, పరమేశ్వర్, తాహేర్, గోరంటాల రాజు, మార్త ఆంజనేయులు, చాంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ

రక్తదాతలందరూ ప్రాణదాతలే..

- ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ

గిర్మాజిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రక్తదాతలు అందరు కూడా ప్రాణదాతలేనని వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ అన్నారు. గురువారం వరంగల్ నర్సంపేట రోడ్డులో ఉన్న అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల జాతీయ సేవా పథకం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అనసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు, తదితర ప్రమాదాలలో గాయపడిన వారికి సకాలంలో రక్తం దొరకక ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం అవసరమైన వారికి అందజేసేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు చాలా ఉపయోగపడుతాయని తెలిపారు. ఆరోగ్యవంతులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోరాదని చెప్పారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయడంతో పాటు తాను మరింత ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. రక్తదానం సామాజిక బాధ్యత అని, ప్రతిఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని ఆమె కోరారు. రక్తదానం చేసిన వైద్య విద్యార్థులు, సిబ్బందికి ప్రిన్సిపాల్ అనసూయ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గీసుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి తరువాత వచ్చే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నర్సంపేట లో ఓ ప్రైవేటు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వెళుతూ మండలంలో ని కొనాయిమాకుల వద్ద మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు ఇంటివద్ద కాసేపు ఆగి మాట్లాడారు. రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రం నుంచి సకాలంలో రైతుల కు ఎరువులను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సరైన సమయంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు, ఎరువులు అందించక పోవడంతో పీఏసీఎస్‌లలో కుర్చీలేక పోతున్నామని చైర్మన్‌లు హరీశ్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, మాజీ జడ్పీటీసీలు పోలీస్ ధర్మారావు, గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, జాకీర్, యూత్ నాయకులు సిరిసె శ్రీకాంత్, కోట ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇది చేతల ప్రభుత్వం

- ఇందిరమ్మ లబ్ధిదారులకు బ్యాంకులో డబ్బులు జమ
- 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్

ఖిలావరంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని, ఇది చేతల ప్రభుత్వమని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అన్నారు. గురువారం 35వ డివిజన్ శివనగర్‌లోని నాలుగు జెండాల వద్ద ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడతగా బ్యాంకులో డబ్బులు జమ అయిన పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారన్నారు. అందులో మొదటివిడతలో 35వ డివిజన్‌కు 100 మందికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయన్నారు. వారు గత నెలలో పనులను బేస్‌మెంట్ పూర్తిచేసి, లెంటల్ వరకు పనులను పూర్తిచేశారని తెలిపారు. 8 మందికి బ్యాంకులో మొదటి విడత డబ్బులు రూ.లక్ష జమ అయ్యాయన్నారు. ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకుందన్నారు. అనంతరం డివిజన్‌లో పలువురు ఇందిరమ్మఇళ్లకు భూమి పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు రేణికుంట్ల శివ, కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, కొత్తూరి రాజు, స్థానిక పెద్దలు గడ్డం సుధాకర్, ఎమ్డీ.అలీ, జన్ను సుధీర్, అప్పికట్ల సన్ని, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ లబ్ధిదారులకు డబ్బులు జమ అయిన బ్యాంకు పత్రాలను చూపుతున్న కార్పొరేటర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 22 మందికి జరిమానా విధిస్తూ గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. 22 మంది వాహనదారులకు రూ.24వేలు జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు రూ.2వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

తడిసి ముద్దయిన రేషన్ బియ్యం

- పరిశీలించిన తహసీల్దార్ ఎక్బాల్



తడిసిన బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వరంగల్‌సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎల్బీనగర్ శ్మశానవాటిక సమీపంలోని రేషన్ షాపులోకి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు చేరి 18 క్వింటాళ్ల బియ్యం తడిసి ముద్దయ్యాయి. దీంతో డీలర్ పాడైపోయిన బియ్యాన్ని ఆరబెట్టినప్పటికీ దుర్వాసన వస్తుండడంతో వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్‌కు సమాచారం అందించారు. దీంతో గురువారం తహసీల్దార్ ఎక్బాల్ రేషన్‌షాపును సందర్శించి తడిసిన బియ్యాన్ని పరిశీలించి వివరాలు సేకరించి సివిల్ సప్లయీస్ అధికారి(డీఎస్‌వో)కి సమాచారం అందించారు.

తీరుమారని కాంగ్రెస్.. శ్రేణుల బేజారు

వరంగల్‌లో పోటాపోటీగా ఓటు చోరీ, కొవ్వొత్తుల ర్యాలీలు



కొండా దంపతుల ఆదేశాలతో నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

వరంగల్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అధికార కాంగ్రెస్ పార్టీలో వరంగల్ నాయకుల తీరు మారడం లేదు. అధిష్ఠానం ఎంత సర్ది చెప్పినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. నాయకులలో ఎలాంటి మార్పు రాకపోవడంతో గురువారం పార్టీ అధిష్ఠానం ఆదేశించిన ఓటు చోరీ-కొవ్వొతుల ర్యాలీలు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రెండు వర్గాలు పోటాపోటీగా నిర్వహించాయి. ఒకటి డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో జరుగగా, మరొకటి మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రెండింటికి సంబంధించిన ఫొటోలు, వార్తలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ శ్రేణులు బేజారు అవుతున్నారు. ఇటీవలే పార్టీ అధిష్ఠానం ఇరు వర్గాలు పార్టీ ఆదేశానుసారం నడుచుకోవాలని, నాయకులంతా కలిసి పనిచేయాలని హితవు చెప్పింది. రెండు రోజులు గడువక ముందే ఎవరి దారిన వారు వెళుతున్నారు. దీంతో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో దీని ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ వాదులు తలలు పట్టుకుంటున్నారు.

కొండా దంపతుల ఆధ్వర్యంలో..

వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యురాలు, మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావుల ఆదేశాలతో కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఓటు చోరీ - గద్దె చోడ్‌కు నిరసనగా పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి కాశిబుగ్గ జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బీజేపీ పాలనలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరముందని నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజ్ మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీని గద్దె దింపే వరకు కాంగ్రెస్ కార్యకర్తలందరు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మడిపెల్లి క్రిష్ణ, కత్తెరశాల వేణుగోపాల్, జారతి రమేష్, బాషిపాక సదానందం, కార్పొరేటర్లు బస్వరాజు కుమార్, ఫుర్కాన్, సోమిశెట్టి ప్రవీణ్, వస్కుల బాబు, బాలినే సురేష్, పోశాల పద్మ, గుండు చందన పూర్ణచందర్, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో..

వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అధిష్ఠానం ఆదేశానుసారం ఓటు చోర్ - గద్దె చోడ్‌కు నిరసనగా వరంగల్ చౌరస్తా నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. బిహార్ ఓటరు జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల కమిషన్ మోదీ తాబేదారుగా పని చేస్తుందా.. దేశ ప్రజలకు జవాబుదారి కాదా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, బస్వరాజు శిరీషశ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మణ్, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, దామెర సర్వేశం, గోరంటాల రాజు, కరాటే ప్రభాకర్, గజ్జెల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గ్రేటర్ వరంగల్ 5
శుక్రవారం 15 ఆగస్టు 2025


హైదరాబాద్ టెస్కాబ్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పాలకవర్గ సభ్యులు

తొలగిన ఉత్కంఠ

6

డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలం గడువు పొడిగింపు

- మరో 6 నెలలు పొడిగించిన ప్రభుత్వం..
- సంబురాల్లో పాలకవర్గం


రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన వరంగల్ కలెక్టర్ కార్యాలయం


ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

పంద్రాగస్టు పండుగ

- స్వాతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు
- హనుమకొండలో పరేడ్ గ్రౌండ్స్.. వరంగల్‌లో ఖుష్‌మహల్ మైదానం...
- పాల్గొననున్న మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్షం పడినా ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

హనుమకొండ/ఖిలావరంగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హనుమకొండ, వరంగల్ జిల్లాలు ముస్తాబయ్యాయి. హనుమకొండ జిల్లాకు సంబంధించి ప్రధాన వేడుకలు జరగనున్న పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రౌండ్ లో ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అతిథుల కోసం వర్షం వచ్చినా తడవకుండా వాటర్‌ప్రూఫ్ షామియాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు సైతం ఇబ్బంది లేకుండా గ్రౌండ్‌ను పటిష్టపరిచారు. గురువారం సాయంత్రం పరేడ్‌లో గౌరవ వందనంలో పాల్గొనే పోలీసు సిబ్బంది రిహార్సల్స్ చే శారు. గ్రౌండ్‌ను ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.
ఉదయం 9.28 గంటలకు మంత్రి గ్రౌండ్‌కు చేరుకుంటారు. 9.30 గంటలకు జెండాను ఎగురవేస్తారు. 9.35 నుంచి 9.50 గంట ల వరకు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 9.50 నుంచి 10.05 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10.05 నుంచి 10.20 వరకు పరేడ్ మార్చ్ ఆఫ్ ఉంటుంది. 10.20 నుంచి 10.20 గంటల వరకు మంత్రి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. అనంత రం వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, తర్వాత ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం ఉంటాయి. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను మంత్రి సురేఖ సందర్శిస్తారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కలెక్టర్ కార్యాలయాన్ని, కలెక్టర్ బంగ్లాను, అంబేద్కర్ సెంటర్‌ను, హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్‌హాల్‌ను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యకూడళ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

వరంగల్ జిల్లా కేంద్రంలో...

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు వరంగల్ జిల్లా కేంద్రం ముస్తాబైంది. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో జరిగే వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను గురువారం కలెక్టర్ సత్యశారద... డీసీపీ అంకిత్ కుమార్, షేక్ సలీమా, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సభా వేదిక, సదుపాయాలు, గ్యాలరీలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా త నిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. వేదిక సమీపంలోని ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించిన కలెక్టర్ స్థానిక పోలీసులు, ట్రాఫిక్ అధికారులతో చర్చించి తగిన మార్గదర్శకాలను జారీ చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఏసీపీ శుభం ప్రకాశ్, డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, నగరపాలక సంస్థ, పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు.


ఖిలావరంగల్ మధ్యకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

జెండా ఎగురవేయనున్న మంత్రి పొంగులేటి

ఖిలా వరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఉదయం 9.40గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం, 9.50నిమిషాలకు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 10.10నిమిషాలకు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వివిధ ప్రభత్వశాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

అడిషనల్ డీసీపీ రవికి ఇండియన్ పోలీస్ మెడల్



వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పరిపాలన విభాగం అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్న నల్లమల రవిని ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండ ప్రాంతానికి చెందిన అడిషనల్ డీసీపీ నల్లమల రవి.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి 1991లో ఎస్సైగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం మెదక్ జిల్లాలోని శివంపేట, తుప్రాన్, మునిపల్లె పోలీసు స్టేషన్‌లలో పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది అమ్రాబాద్, మిర్యాలగూడ, సదాశివపేట సర్కిల్ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. అలాగే సంగారెడ్డి, జహీరాబాద్ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం అడిషనల్ డీసీపీగా, కరీంనగర్ పోలీసు ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. నక్సల్ ప్రాబల్యం ఉన్న పోలీసు స్టేషన్‌లలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా విజయవంతంగా విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి పలు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు మెడల్ ఎంపికైన అడిషనల్ డీసీపీ రవిని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

నమ్మించి మోసం చేశాడు..



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

- క్రెడిట్ కార్డుల ద్వారా డబ్బులు స్వాహా
- డిజిటల్ సేవా షాప్ నిర్వాహకుడి చీటింగ్
- కస్టమర్లకు చెందిన రూ.28 లక్షలు సొంతానికి వాడకం
- బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

6

ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

పర్వతగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద గురువారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. ఆగ్రోస్ కేంద్రానికి యూరియా వచ్చిందని తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు ఉదయం నుంచే చేరుకొని గుమిగూడారు. దీంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్తతకు దారితీయకుండా పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి రైతులకు యూరియాను సరఫరా చేయించారు.

మండలానికి సరిపడా యూరియా ఉంది : ఏవో ప్రశాంత్

మండల రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వర్షాల కారణంగా రెండు రోజులు ఆలస్యమైంది. సహకార సంఘానికి 450 బస్తాల యూరియా రానుంది. ప్రతి రెండు రోజులకు ఒక లారీ లోడు మండలానికి వస్తుందని తెలిపారు.



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

గీసుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి తరువాత వచ్చే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఆర్థిక శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నర్సంపేటలో ఓ ప్రైవేటు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వెళుతూ కొనాయిమాకుల వద్ద మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు ఇంటివద్ద కాసేపు ఆగి మాట్లాడారు. రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదన్నారు. కేంద్రం నుంచి సకాలంలో రైతులకు ఎరువులను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా సరైన సమయంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరు, ఎరువులు అందించక పోవడంతో పీఏసీఎస్‌లలో కూర్చోలేకపోతున్నామని చైర్మన్‌లు హరీశ్‌రావు దృష్టికితీసుకు వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఎపుడు అండగా ఉంటుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని హరీశ్ రావు భరోసా ఇచ్చారు.. భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, మాజీ జెడ్పీటీసీలు పోలీస్ ధర్మారావు, గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు చల్లా వేణుగోపాల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, జాకీర్, యూత్ నాయకులు సిరిసె శ్రీకాంత్, కోట ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రైవేట్ వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి..

నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వైద్యం సామాన్య ప్రజలకు అందుబాటులోఉండేలా వైద్యులు కృషిచేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నర్సంపేట పట్టణంలో ఆ ప్రైవేటు ఆస్పత్రిని గురువారం హరీశ్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నర్సంపేట ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రజలకు చేరవకావడం హర్షణీయమన్నారు. ప్రైవేట్ వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, వైసతీష్‌రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, గుగులోతు రామస్వామి, రాయిడి రవీందర్‌రెడ్డి, వెంకటనారాయణగౌడ్, మనోహర్‌రెడ్డి, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం వినతి

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రైవేట్ కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడితీసుకురావాలని కోరుతూ కళాశాలల యాజమాన్యం గురువారం హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల సుధాకర్‌రెడ్డి, జీజుల సాగర్, పరమేశ్వర్, మాధవరెడ్డి, అనిల్, తిరుపతి, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు కాట్ల భద్రయ్య పొన్నం మొగిలి, గుండెకారి రంగారావు, రవీందర్, కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, తోటకూరి రాజు, పిండి కుమారస్వామి, ముత్యాల స్వామి, ఉమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పెండ్యాల రాజు తదితరులు ఉన్నారు.

●నల్లబెల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రగూడెంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు మండల బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి, నాయకులు చెట్టుపల్లి మురళీధర్, ఊడుగుల ప్రవీణ్, కొత్తపల్లి కోటిలింగాచారి, బానోతు హరినాద్, శ్రీనివాస్‌గుప్తా, తక్కళ్లపల్లి మోహన్‌రావు, శివాజీ, మోహన్‌రెడ్డి, పవన్, రాజు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సత్యశారద



ఎల్గూరు చెరువు వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

సంగెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చెరువు వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద చెప్పారు. గురువారం మండలంలోని ఎల్గూరు రంగంపేటలోని ఎల్గూరు చెరువు మత్తడిని, గ్రామంలోని రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు నిండుకుండలా ఉందని ఈ ప్రాంతంలోకి పిల్లలను రానివ్వొద్దని చెప్పారు. చెరువు కట్ట, మత్తడి బలహీనపడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మత్తడి పరిస్థితి, నీటి ప్రవాహక మార్గాలు, మత్తడిలో బలహీనమైన, కట్టకు గండి పడే ప్రాంతాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వరదవలన కలిగే నష్టాలను ముందస్తుగా అంచనాలు వేసుకోవాలని అన్నారు. చెరువు కట్టపై ప్రజలు, వాహనాల రాకపోకలు నిలిపివేయాలని చెప్పారు. ప్రజల ఆస్తుల రక్షణను కాపాడాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని అన్నారు. కట్టవెంట కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు నడుచుకుంటూ వెళ్లారు. అనంతరం గ్రామంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటి నిలువపై ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ఆమె వెంటనే రైల్వే ట్రాక్ అండర్‌పాస్ వద్ద వరద నీటి నిల్వ, రిటైనింగ్ వాల్స్, స్లాబ్, మురుగునీటిని పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత, డీఈ గణేశ్, ఎఈ హమిద్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో కాసర్ల రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానం

వర్ధన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న చందర్ కుమార్తె మనస్విని బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అత్యున్నత ప్రతిభ కనబరిచింది. ఈ నెల 9 నుంచి 14 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-13 విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకుంది.



మనస్విని

పేటెంట్‌పై జాతీయ సదస్సు

నర్సంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ (బిప్స్) కళాశాలలో గురువారం పేటెంట్‌పై జాతీయ సదస్సును నిర్వహించారు. అహ్మదాబాద్‌కు చెందిన రిసోర్స్‌పర్సన్ శిరీషవర్ధన్ మాట్లాడుతూ పేటెంట్ విశిష్టతను అధ్యాపకులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ మాట్లాడుతూ పేటెంట్ అనేది ఒక రకమైన చట్టపరమైన మేథోసంపత్తి హక్కు అన్నారు. అధ్యాపకులు నూత న ఆవిష్కరణలను కనుగొనాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ పుట్ట రవి, టి.మనీష్‌కుమార్, జె.రవి అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

గీసుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు గీసుగొండలో గురువారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ములక ప్రసాద్, జాన్‌విక్రం, సాంబరాజు, అరకట్ల ప్రవీణ్, ఆకుల వెంకన్న, కత్తి వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీ మేరకు పింఛన్‌లను పెంచాలి

గీసుగొండ. ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, బీడి, గీతకార్మిలకు పింఛన్‌లను పెంచాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సురేష్ అన్నారు. గీసుగొండలో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ నెల 25న గీసుగొండలో నిర్వహించే పింఛన్‌దారుల సన్నాహక సమావేశానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మంద కృష్ణమాదిగ వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కట్ల రాజశేఖర్, చిన్నపల్లి రవి, వెంకటేశ్వర్లు, పూర్ణయ్య, రాజు,నిరంజన్ పాల్గొన్నారు.

దుగ్గొండి ఏపీఎంగా రమేశ్

దుగ్గొండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల డీఆర్‌డీఏ ఐకెపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)గా ఈద రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్ బదిలీపై సంగెం మండలానికి వెళ్లగా, జనగాం జిల్లా చిలుపూర్‌లో ఏపీఎంగా పని చేసిన ఈద రమేశ్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లోని సమాఖ్య సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సీఏలు, మండల సీసీలు అందరూ ఐక్యంగా నిలిచి సంఘాల ఆర్థిక పరిపుష్టికి పాటుపడాలన్నారు. ఎల్లవేళలా సంఘాల ప్రగతికై పని చేస్తానన్నారు. అన్ని గ్రామాల సంఘాల బాధ్యులు సహకరించాలన్నారు.



రమేశ్

బురదమయంగా మారిన ఎంపీడీవో కార్యాలయం

చెన్నారావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వర్షం కురిస్తేచాలు అంత బురదమయంగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రాంగణం ఆవరణలో ఎక్కడ చూసినా వరద నీరు ఉంది. వచ్చిపోయే వాహనాలతో మరింత బురదమయంగా మారుతుంది. అధికారులు చొరవ తీసుకొని కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాల పంపిణీ

నర్సంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన 70 మంది లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డుల మంజూరి పత్రాలను గురువారం గ్రామ కార్యదర్శితో కలిసి మాజీ ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వరూప ఓదేలు మాట్లాడుతూ పదేళ్ళ బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికీ రేషన్ కార్డు పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదన్నారు. అర్హులైన వారికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రహీంపాషా, సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్‌పార్టీ మండల కార్యదర్శి మంద యాకయ్యగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామంలో నూతన రేషన్ కార్డులను 60 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ కార్డులను అందించటంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. రేషన్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవచ్చన్నారు. అలాగే పాపయ్యపేటలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, కోనాపురంలో మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు రేషన్ కార్డుల లబ్ధిదారులకు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బండి హరీశ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్‌కార్డుల మంజూరీ పత్రాలను అందజేస్తున్న గ్రామ కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ

సఖి సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

రాయపర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలని కేంద్రం నిర్వాహకులు స్వప్న, పావనిలు సూచించారు. గురువారం మండలంలోని కొత్తూరులో వీవో మీటింగ్, అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు, వృద్ధులకు అందించే సేవలు వివరించారు. బాలికల రక్షణ, మహిళల భద్రత పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నట్లు గుర్తుచేశారు. మహిళలు ఎలాంటి ఆపదలో ఉన్నా 181కు, వృద్ధులు 1467 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏ స్వప్న, అంగన్‌వాడీ టీచర్ విద్యావతి, అమలాదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల

ఆటో కార్మిక సంఘం ఏర్పాటు

దుగ్గొండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఆటో కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ మండల ఆటో కార్మిక సంఘం కమిటీని గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్ సమక్షంలో ఎంపికచేశారు. గౌరవ అధ్యక్షుడిగా డ్యాగం శివాజీ, అధ్యక్షుడిగా బండి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కొలిపాక కోటిలింగం, భూక్య సతీష్, ప్రధాన కార్యదర్శిగా నేదురు రాజేశ్వర్‌రావు, కార్యదర్శిగా గుండెబోయిన చిరంజీవి, సహాయ కార్యద ర్శులుగా కిస్టోజు సాంబచారి, అంబరకొండ రాజబాబు, సభ్యులుగా జనగాం మహేశ్, మాదాసి సూరయ్య, ఏసీకే దేవేందర్, దండు శ్రీనివాస్, గుండెబోయిన రాజు, బొడిగె చిరంజీవి, గొర్రె నవీన్, మంద అశోక్, చందా మణికంఠ, సలహారులుగా గైని భాస్కర్, నేదురు రాజశేఖర్, రాంపాక భాస్కర్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, డ్యాగం శివాజీ, ఇంగోలి రాజేశ్వర్‌రావు, కూర తోట సురేశ్, రవివర్మ, హింగె రామారావు, జంగిలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రంలో నాచినపల్లి విద్యార్థులు

దుగ్గొండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత నిర్వహణలో ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో గురువారం విద్యార్థులు గేయాలను ఆలపించారు. దేశ భక్తిగేయాలను, స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన మహిళా యోధులను పరిచయం చేస్తూ పాటలు పాడారు. వాతావరణ కాలుష్యం వల్ల ఏర్పాడు పరిస్థితిపై కవితలు పాడి పలువురిని అబ్బుర పరిచారు. ఆదివారం చిన్నారి లోకంలో ప్రసారమవుతుందని ఉపాధ్యాయురాలు సుమలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జ్యోతిలక్ష్మి అభినందించారు.

పరామర్శ



వెంకన్నను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న రైస్ మిల్లు ఓనర్ వల్లపు వెంకన్న ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం ఇంటికి వెళ్లి పరామర్శించారు.

● సంగెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన మృతుల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి అండగా ఉంటానని చెప్పారు. గురువారం మండలంలోని నర్సానగర్, కాట్రపల్లి, సంగెం, ఆశాలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి మృతి చెందిన మాడిశెట్టి ఐలమ్మ, పులి వనమ్మ, మేకల కొమురమ్మ, బొల్ల కొమురమ్మ, నాగబెల్లి సుదర్శన్ కుటుంబాలకు భరోసా ఇచ్చారు. మృతుల చిత్రపటాలకు పూల మాలు వేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మల్లయ్య, నాయకులు ఉన్నారు.



సంగెంలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

ఆర్‌యూబీ నీటిలో మునిగి దుక్కిటెద్దు మృతి

నెక్కొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్రపల్లి గ్రామ రైతు భైరు ఎల్లయ్యకు చెందిన దుక్కిటెద్దు గురువారం ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీ నీటిలో మునిగి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం దుక్కిటెద్దులను ఎల్లయ్య తీసుకెళుతుండగా గుండ్రపల్లి రైల్వే గెటు వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీ నీటి నుంచి వెళుతున్న క్రమంలో బ్రిడ్జికి సంబంధించిన ఇనుపరాడ్లు ఎద్దు పొట్టలో గుచ్చుకోవడంతో మృతి చెందిందన్నారు. ఈ ప్రమాదం కారణంగా రూ. 60 వేల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

గీసుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో ఉన్న కోట చంటి అనే ఓ వ్యక్తి గీసుగొండలో వీరంగం చేసి మహిళతో పాటు మరో వ్యక్తిపై దాడి చేసినందుకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్యం మత్తులో ఉన్న చంటి అదే గ్రామానికి చెందిన కంత్రి మరియ ఇంట్లోకి భర్తలేని సమయంలో వెళ్లి నానా భూతులు తిడుతూ దాడిచేశాడు. అదేవిధంగా మంద అనిల్ ఇంటికి వెళ్లి కుక్కలు ఎందుకు పెంచుతున్నావంటూ అనిల్ దవడపై రాయితో కొట్టగా అతడి దవడ పండ్లు విరిగినట్లు చెప్పారు. కాగా మరియ, రాజు ఫిర్యాదు మేరకు చంటిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

సంగెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలు కలుగడం లేదనే బెంగతో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన జరిగింది. సంగెం ఎస్సై నరేష్ అందించిన సమచారం మేరకు.. మండలంలోని వంజర పల్లి గ్రామానికి చెందిన సూర్య రామారావు (47) 25 ఏళ్లుగా తమకు పిల్లలు కలుగడం లేదనే తీవ్రమైన మానసిక వేదనతో గురువారం ఉదయం ఇంటి బయట క్రిమిసంహారక మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమ నించి 108వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా ఇదే రోజు మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



రామారావు (ఫైల్)

వాహనం ఢీకొని యువకుడి మృతి

రాయపర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొరిపిరాల క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన గారె అంజనేయులు(28) గత కొంతకాలంగా జమ్మికుంటలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. బోనాల పండుగ సందర్భంగా గ్రామానికి చేరుకున్నాడు. ఈ మేరకు వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై మొరిపిరాల క్రాస్ రోడ్డుకు రాత్రి వెళ్లాడు. ఈ తరుణంలో ఫోన్ రాగా, ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించాడు. వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయాన్ని పోలీసులు మృతుడి భార్యకు చెప్పడంతో, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు.



ఆంజనేయులు (ఫైల్)

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

వర్ధన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న కాంట్రక్టర్ నిర్లక్ష్యం, ఇంజనీరు అధికారుల నిర్లక్ష్యం మునిసిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో వర్ధన్నపేట పట్టణ పరిధిలోని శ్మశానవాటికలో నిర్మించిన పోస్టుమార్టం గదికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. శ్మశానం నుంచి తెట్టకుంట తండాకు వెళ్లే మార్గం సైతం బురదమయంగా మారి తండావాసులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు, వ్యవసాయ కూలీలను ఇక్కట్ల పాలు చేస్తుంది. పోస్టుమార్టం గది చుట్టూ అదే ప్రాంతంలో అమృత్‌దారా పథకంలో మంజూరైన నీటి ట్యాంక్‌ను నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పోస్టుమార్టం గది చుట్టూ ట్యాంక్ నిర్మాణం కోసం చేపట్టిన గుంతలో నుంచి తీసిన మట్టి పోయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పోస్టుమార్టం గది చుట్టూ బురదమయంగా మారి మృతదేహాలను తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. పోస్టుమార్టం గదికి విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ సర్వీస్ వైర్ సైతం నేలపై పడడంతో ఎప్పుడు ఎవ్వరూ విద్యుత్ షాక్‌కు గురవుతారోనని బెంబేలెత్తుతున్నారు. మునిసిపాలిటీ అధికారులు పోస్టుమార్టం గది చుట్టూ పోసిన మట్టిని తొలగించాలని, పోస్టుమార్టం గదికి వెళ్లే విద్యుత్ వైరును శాశ్వతంగా బిగించే ఏర్పాట్లు చేయడంతో పాటు శ్మశానవాటికలో అంతర్గత రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పోస్టుమార్టం గది చుట్టూ పోసిన మొరం కుప్పలు, నేలపై ఉన్న విద్యుత్ సర్వీస్ వైర్

కోతుల నియంత్రణకు.. కోటి విద్యలు!

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కోతుల నియంత్రణకు రైతులు కోటి విద్యలు పడాల్సి వస్తోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు వినూత్న రీతిలో ఆలోచిస్తున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామంలో పొనుగోటి మాధవరావు అనే రైతు తనకున్న రెండెకరాల్లో పెసర పంటను వేశాడు. కోతుల నుంచి పంటను కాపాడుకునేందుకు రూ.15 వేలు ఖర్చు చేసి చేను చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. కొన్ని చోట్ల వలలు సైతం ఏర్పాటు చేశాడు. కొండెంగలను చూసి కోతులు భయపడి తన పంటలోకి రావదని వాటి ఫ్లెక్సీలను సైతం చేను చుట్టూ ఏర్పాటు చేశాడు. ఎంత చేసిన కోతుల బాధ తప్పడం లేదని, కొన్ని చిన్న చిన్న కోతులు లోపలికి వెళ్తున్నాయని చెపుతున్నాడు. ఏదేమైనా కోతుల కోసం రైతు చేసిన ప్రయత్నాన్ని చూసి రోడ్డు పై వెళ్లే బాటసారులు ఏమి ఆలోచనా అంటూ కితాబిస్తున్నారు.



చేను చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్, కొండెంగ ఫ్లెక్సీ



రైతు పొనుగోటి మాధవరావు